
కేరళ ఆలయానికి రోబోటిక్ ఏనుగు



2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం

గుంటూరు - గురువారం 16 ఏప్రిల్ 2026 | సంపుటి: 10 | సంచిక: 101 | పేజీలు: 8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## దంచుతున్న ఎండలు

రేపు, ఎల్లుండి ఇంకా దంచి కొడ్తయంట



2



# పేదలకు పట్టెడన్నం...

# చంద్రన్న సంకల్పం

## 269 అన్న క్యాంటీన్లు... రూ. 243 కోట్లు వ్యయం

## అన్న క్యాంటీన్లో కార్మికులతో కలిసి చంద్రన్నలంచ్

పేదలకు పట్టెడన్నం పెట్టడమే తెలుగుదేశం ధ్యేయమని నాడు రామన్న... నేడు చంద్రన్న నిరూపించారు. తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా 207 అన్నక్యాంటీన్లలో పేదలకు భోజన వసతి కోసం రూ.243 కోట్లు చంద్రన్న ప్రభుత్వం వెచ్చించింది. ఇపుడు మరో 62 కొత్త అన్న క్యాంటీన్లను ప్రారంభించారు.

**అమరావతి, (మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ అంటేనే అన్నపూర్ణ. పేదలకు ఏ లోటు రానీయకుండా, సంక్షేమంలో భాగంగా అన్న క్యాంటీన్లను ప్రభుత్వం సమర్ధంగా నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 207 అన్న క్యాంటీన్లను ఇప్పటికే నడుపుతుండగా, మరో 62 కొత్త క్యాంటీన్లను ప్రభుత్వం బుధవారం ప్రారంభించింది. పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో కార్మికులతో కలిసి అన్నక్యాంటీన్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు స్వయంగా భోజనం వడ్డించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ, అన్న క్యాంటీన్‌లోనే భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 207 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. ఇపుడు గ్రామీణ ప్రాంతాల్లో మరో 62 అన్న కాంటీన్లను ప్రారంభించారు. దీనితో మొత్తంగా రాష్ట్రంలో 269 అన్న

...మిగతా 2లో



## 50 శాతం సీట్లు పెంచుతరు

### డీలిమిటేషన్ అంశాలపై వివరణ ఇచ్చిన కేంద్ర సమాచార శాఖ

### నేటి పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బిల్లు ప్రవేశం

**ఢిల్లీ, ఏప్రిల్ 15:** దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకూ స్పష్టతనిచ్చింది. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల సంఖ్యలో 50 శాతం పెంపు ఉంటుందని కేంద్రం అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు బిల్లులో నిబంధనలను పొందుపరిచినట్లు సమాచార శాఖ స్పష్టం చేసింది. డీలిమిటేషన్ ప్రక్రియ కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుందని గతకొన్ని రోజులుగా సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్రం కొట్టిపారేసింది. అటువంటి వార్తల్లో నిజం లేదని, అపోహలను నమ్మవద్దని సూచించింది. జనాభా ప్రాతిపదికన మాత్రమే కాకుండా, భౌగోళిక విస్తీర్ణం, ఇతర శాస్త్రీయ అంశాలను పరిగణనలోకి తీసుకుని సీట్ల పెంపు ఉంటుందని కేంద్రం సంకేతాలిచ్చింది.

**50% పెంపు..**

ప్రస్తుతమున్న సీట్ల సంఖ్యకు అదనంగా సగం సీట్లు

...మిగతా 2లో



## డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా ఓటేస్తం

- మహిళా బిల్లుకు అనుకూలమే
- ఈ రెండిటికీ ముడిపెట్టి రాజకీయ కుతంత్రం చేస్తున్న కేంద్రం
- ఇండి కూటమి నేతల సమావేశానంతరం ఖర్గే

**ఢిల్లీ, ఏప్రిల్ 15:** మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగంలోని అధికారాలన్నింటినీ

...మిగతా 2లో

### సిసలైన కార్యకర్తకే అందలం

# పదవుల పందేరంలో లోకేష్ మార్క్!



**అమరావతి, ఏప్రిల్ 15, మనం న్యూస్:** ఏడాది క్రితం కడప మహానాడులో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ కొన్ని అంశాలను ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ప్రణాళికా బద్ధంగా వ్యవహరిస్తూ... పార్టీలో గతంలో ఎన్నడూ లేని విధంగా జోష్ నింపారు. కొత్త పంథాలో పార్టీని రన్ చేస్తున్నారు. కడప మహానాడులో కార్యకర్తే అధినేత అనే తెలుగుదేశం పార్టీ ఓ నినాదమిచ్చింది. అయితే ఇది నినాదంగానే మిగిలిపోకుండా... పార్టీ విధానంగా మార్చుకునేలా లోకేష్

...మిగతా 2లో

## మూల్పూరి సాయి కళ్యాణిని వరించిన తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పదవి



**హనుమాన్ జంక్షన్, ఏప్రిల్ 15 (మనం న్యూస్):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా హనుమాన్ జంక్షన్ కు చెందిన మూల్పూరి సాయి కళ్యాణి నియమితులయ్యారు.ఈ మేరకు తెలుగు దేశం రాష్ట్ర పార్టీ నుండి బుదవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఇప్పటి వరకు సాయి కళ్యాణి తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా పనిచేసి అధిష్టానవర్గం నుండి మంచి పేరు తెచ్చుకున్నారు. వైసీపీ ప్రభుత్వ దాష్టీకానికి, విధ్వంసాలకి, అరాచకాలలో సాయి కళ్యాణిని అక్రమంగా అరెస్టు చేసి విజయవాడ సబ్ జైల్లో ఉంచారు, అదే సమయంలో హనుమాన్

...మిగతా 2లో

## టీడీపీ పొలిట్ బ్యూరో ఎక్స్ అఫిషియో మెంబెర్‌గా నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కష్ణ దేవరాయలు



**గుంటూరు, ఏప్రిల్, 15,(మనం న్యూస్):** తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన తాజా పార్టీ పదవుల్లో టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కష్ణ దేవరాయలు కి సముచిత స్థానం లభించింది. టీడీపీ పొలిట్ బ్యూరో ఎక్స్ అఫిషియో మెంబెర్ గా లావు శ్రీ కష్ణ దేవరాయలుని పార్టీ అధిష్టానం నియమించింది. టీడీపీ పొలిట్ బ్యూరో ఎక్స్ అఫిషియో మెంబెర్లుగా ముగ్గురు ఉండగా

## రాయపూడి సిఆర్డిఏ ఎదుట అన్నక్యాంటీన్ ప్రారంభం



**అమరావతి, ఏప్రిల్ 14 (మనం న్యూస్):** రాజధాని ప్రాంతం రాయపూడిలోని సిఆర్డిఏ ప్రధాన కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్ ను కమిషనర్ వి. విజయరామరాజు ప్రారంభించారు. ప్రజా రాజధాని అమరావతిలో పనులను పర్యవేక్షించే ఏపి సిఆర్డిఏ ప్రధాన కార్యాలయం ఎదుట వద్ద సిద్ధమైన అన్న క్యాంటీన్ సేవలను కమిషనర్ వి. విజయరామరాజ రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవతేజ, ఇంజినీర్-ఇన్- చీఫ్ ఆర్.గోపాలకష్ణ రెడ్డి, అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎడిసిఎల్) చీఫ్ ఇంజినీర్ సిహెచ్.

...మిగతా 2లో



## బీహార్ సీఎంగా సమ్రాట్ చౌదరి ప్రమాణం

**పాట్నా, ఏప్రిల్ 15:** బీహార్ 21వ ముఖ్యమంత్రిగా బీజేపీ సీనియర్ నేత సమ్రాట్ చౌదరి ప్రమాణస్వీకారం చేశారు. లోక్ భవన్ లో ఆ రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అతా హస్నన్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ

...మిగతా 2లో

## ప్రతిరోజు తాగునీటి శాంపిల్ సేకరించి తనిఖీలు నిర్వహించాలన్న నగర కమిషనర్

2

## నేటి నుంచి డిజిటల్ జనగణన 2027 ప్రారంభం

ప్రపంచంలోనే అతిపెద్ద గణాంక కార్యక్రమమైన జనగణన 2027 ప్రారంభానికి ఆంధ్రప్రదేశ్ లో రంగం సిద్ధం అయింది. ఈ నెల 16 నుంచి అంటే, నేటి నుంచి మొదటి దశగా ఇండ్ల జాబితా, ఇండ్ల గణన రాష్ట్రంలో ప్రారంభం కానుంది. దేశంలోనే అతిపెద్ద పరిపాలనా కార్యక్రమంగా నిలిచే ఈ జనగణన, ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో, స్వీయ-గణన సదుపాయం కల్పించడం ఈసారి ప్రత్యేకత.

■ పి.మీరాహుస్సే ఖాన్

**అమరావతి, (మనం ప్రత్యేక ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డిజిటల్ జనగణన 2027 ప్రారంభం అయిందని ఆంధ్రప్రదేశ్ జనగణన కార్యకలాపాల సంచాలకులు జె.నివాస్ ప్రకటించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని ప్రచార విభాగంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో విజయవాడ పి.ఐ.బి. సంచాలకులు జి.సురేష్ కుమార్ తో కలిసి ఆయన మాట్లాడుతూ, భారత దేశంలో జనగణన ఒక రాజ్యాంగబద్ధమైన కార్యక్రమని, ఇది రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లో 69వ అంశంగా ఉందన్నారు. 1948 జనగణన చట్టం మరియు 1990 నియమాల ప్రకారం, సేకరించిన వ్యక్తిగత సమాచారం సెక్షన్ 15 ప్రకారం పూర్తిగా గోప్యంగా ఉంచుతామన్నారు. జనగణన నిర్వహణకు కేంద్ర స్థాయిలో యూనియన్ హోం మంత్రి, యూనియన్ హోం సెక్రటరీ, రిజిస్ట్రార్ జనరల్ డసెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా బాధ్యత వహిస్తారన్నారు. రాష్ట్ర స్థాయిలో డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్

...మిగతా 2లో

### అప్పుల ఊబిలో పాక్..

## ఆదుకున్న సౌదీ

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 15:** ఆర్థిక సమస్యలతో సతమతమవుతోన్న పాకిస్తాన్ కు సౌదీ అరేబియా మరోసారి అండగా నిలిచింది. ముఖ్యంగా విదేశీ మారక నిల్వలు క్షీణిస్తున్న వేళ.. మూడు బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం అందించేందుకు అంగీకరించింది. వచ్చే వారం రోజుల్లో ఈ నిధులు విడుదలయ్యే అవకాశాలున్నట్లు పాకిస్తాన్ ఆర్థిక శాఖ వెల్లడించింది. అంతేకాదు, ఇదివరకే తీసుకున్న ఐదు బిలియన్ డాలర్ల ఒప్పందాన్ని ఏటా పునరుద్ధరించాల్సి ఉన్నప్పటికీ.. ఈ గడువును కూడా సౌదీ అరేబియామూడేళ్లకు పొడిగిం చింది. ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్న పాకిస్థాన్ అనేక అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాలు తీసుకుంటోంది. ఈ క్రమంలో

...మిగతా 2లో

## చమురు ధరలు భారీగా తగ్గుతయ్

### డొనాల్డ్ ట్రంప్ ఉవాచ




**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోతున్న నేపథ్యంలో ఇరాన్ యుద్ధం ముగిసిన తర్వాత చమురు ధరలు భారీగా తగ్గుతాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. ఆదివారం మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆరోపించారు. నవంబర్ నాటికి చమురు ధరలు పెరుగుతాయని తాను చెప్పినట్లు తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారన్నారు. ధరలు పెరుగుతాయని

...మిగతా 2లో

## ఇరాన్‌తో మళ్లీ చర్చిస్తాం..

# కానీ, 2 షరతులు



### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** పశ్చిమాసియాలో యుద్ధం ముగించే విషయమై అమెరికా-ఇరాన్ మరోసారి శాంతి చర్చలకు సిద్ధమవుతున్నాయి. రెండు రోజుల్లో ఈ సంప్రదింపులు జరగొచ్చని అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ప్రకటించారు. అయితే, ఇరాన్ కు అమెరికా రెండు షరతులు విధించినట్లు ఇజ్రాయెల్ మీడియా వెల్లడించింది. 'రెండో దఫా చర్చల ప్రారంభానికి అమెరికా రెండు షరతులు పెట్టింది. హర్మూజ్ జలసంధిలో ఎలాంటి ఆంక్షలు లేకుండా దాన్ని పూర్తిగా తెరవడం.. అనేది మొదటిది. కాగా, చర్చలకు వచ్చే ఇరాన్ ప్రతినిధి బృందం

...మిగతా 2లో

## హర్మూజ్‌లో అమెరికా నిఘా డ్రోన్ కూల్చివేత

దాని విలువ రూ.2,222 కోట్లు

2

## దండుగ పని

ఇరాన్‌తో యుద్ధం వల్ల ఏమాత్రం ప్రయోజనం లేదు

54 శాతం మంది అమెరికన్ల అభిప్రాయమిది

ఇప్సాస్-రాయిటర్స్ నిర్వహించిన సర్వేలో వెల్లడైన వాస్తవం

ట్రంప్ సొంత పార్టీలో చీలికలు తెచ్చే సర్వే ఇది అంటూ వార్తలు

# పదవుల పందేరంలో లోకేష్ మార్క్!

(మొదటి పేజీ తరువాయి)

పక్కా వ్యూహంతో వెళ్లారు. గత ఏడాది కాలంగా లోకేష్ అమలు చేస్తున్న ప్రణాళికలు ఇప్పుడు ఓ కొలిక్కి వచ్చాయి. తాజాగా టీడీపీ అధినాయకత్వం ప్రకటించిన కమిటీల్లో ఆ మార్పు స్పష్టంగా కన్పించింది. తెలుగుదేశం పార్టీలో సామాన్య కార్యకర్తకు అందని ద్రాక్షగా, కలగా మిగిలిపోయే పదవులను సామాన్య కార్యకర్తలకు దక్కేలా చేయడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారు. క్లస్టర్ ఇన్చార్జీల పదవిని తేలిగ్గా తీసుకోవద్దని... ఇది చిన్న పోస్టు కాదని... పార్టీలోని ద్వితీయ శ్రేణి నేతలకు అప్పగించిన ఈ పోస్టులను సమర్థవంతంగా అమలు చేస్తే వారిని పార్టీలో అత్యున్నత స్థాయికి తీసుకెళ్తామని లోకేష్ చాలా కాలంగా చెబుతూనే ఉన్నారు. ఇప్పుడు అది నిజమైంది. పార్టీకి చెందిన అత్యున్నత స్థాయి కమిటీ అయిన పొలిట్ బ్యూరోలో విజయనగరం జిల్లా మండల పార్టీ అధ్యక్షురాలికి.. మంగళగిరి క్లస్టర్ ఇన్చార్జికి చోటు దక్కింది. దీంతో ప్రస్తుతం ప్రకటించిన కమిటీల్లో లోకేష్ మార్క్ స్పష్టంగా కన్పిస్తోందనే చర్చ జరుగుతోంది.

**కమిటీల కూర్పులో టీడీపీకి న్యూ లుక్...**

పొలిట్ బ్యూరో నుంచి జాతీయ, రాష్ట్ర కమిటీల వరకూ పూర్తి న్యూ లుక్ తీసుకొచ్చేలా రూపొందించిన ఈ కూర్పు పార్టీ అంతర్గత వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికినట్టైనని చెప్పాలి. పని చెప్పేవారికి కాదు... పని చేసేవారికే పెద్ద పీట అన్న సందేశాన్ని లోకేష్ బలంగా ఇచ్చారనే చెప్పాలి. ఇది కేవలం నినాదంగా మిగిలిపోకుండా... నిర్ణయాల్లో ప్రతిఫలించిన విధానంగా తీసుకురావడంలో లోకేష్ ఏడాది కషి ఉందనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడే తన ఆలోచనలు ఏ స్థాయిలో ఉంటాయోననేది లోకేష్ ఓ టీజర్ వదిలారని అంటున్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమ వేదికపై సీనియర్ నేతలను కాకుండా... క్షేత్రస్థాయిలో కష్టపడిన నిజమైన కార్యకర్తలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, కేడర్‌కు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. కార్యకర్తల బాధ్యతలను స్వీకరించినప్పటి నుంచి వారి సంక్షేమం, గుర్తింపు, అవకాశాలు అనే మూడు స్థంభాలపై లోకేష్ పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారు. ఒకవైపు కార్యకర్తల సంక్షేమాన్ని బలోపేతం చేస్తూనే, మరోవైపు పని చేసిన వారికే పదవులు అనే క్రమశిక్షణాత్మక విధానాన్ని కచ్చితంగా అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. యువతకు సముచిత స్థానం కల్పించడం, భవిష్యత్ నాయకత్వాన్ని తయారు చేయడం దిశగా జరిగిన ఈ కూర్పులో లోకేష్ ముద్ర స్పష్టంగా కన్పిస్తోందనే భావన వ్యక్తమవుతోంది. కమిటీల్లో యువతకు పెద్ద పీట వేసేలా లోకేష్ చొరవ చూపారనేది పార్టీలో జరుగుతున్న చర్చ. ఈ మేరకు పార్టీ అధినాయకత్వంతో సంప్రదింపులు జరుపుతూ సక్సెస్ అయ్యారని అంటున్నారు. రాజకీయ నేపథ్యం లేకున్నా... పార్టీ కోసం నిస్వార్థంగా పని చేసిన సామాన్య కార్యకర్తలను గుర్తించేందుకు లోకేష్ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. దీని ద్వారా లోకేష్ సంస్థాగత పారదర్శకతకు ప్రాధాన్యత ఇచ్చారనే అభిప్రాయం వ్యక్తమవతోంది.

**సీనియర్-జూనియర్ కాంబినేషన్**

సీనియర్ల అనుభవం-జూనియర్ల దూకుడు అనే సమతుల్యతతో పార్టీని నడిపించే వ్యూహాన్ని అమలు చేసే దిశగా లోకేష్ అడుగులు వేస్తున్నట్టు కన్పిస్తోంది. అనుభవం ఉన్న నేతలకు గౌరవం, కొత్త తరం నాయకులకు అవకాశాలు అనే దిశగా పార్టీని ముందుకు తీసుకెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ కమిటీల కూర్పు ద్వారా తెలుగుదేశం పార్టీకి కొత్త శైలి, కొత్త సంస్కృతి, కొత్త నాయకత్వాన్ని అందించే బాధ్యతను లోకేష్ భుజాల మీద వేసుకున్నారనే అంశం స్పష్టంగా కన్పిస్తోందనే చర్చ జరుగుతోంది.

## మూల్పూరి సాయి కళ్యాణిని వరించిన తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పదవి



(మొదటి పేజీ తరువాయి)

జంక్షన్ పర్యటనలో వచ్చిన చంద్రబాబు నాయుడు సాయి కళ్యాణి ఇంటికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అక్రమ కేసులు పెట్టినా,ఎక్కడా భయపడకుండా ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా.నారి శక్తిగా టీడీపీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను, కార్యక్రమాలను,నిరసనలు తూచతప్పకుండా నిర్వహిస్తూ,ప్రజలను చైతన్య పరుస్తూ టిడిపి-జనసేన-బీజేపీ కూటమి గెలుపు కోసం అహర్నిశలు కషి చేశారు.అలాగే అమరావతి రాజధాని రైతులకు అండగా నిలుస్తూ,ప్రతి నిరసన కార్యక్రమాలలో పాల్గొన్నారు.మరో పక్క కరోనా సమయంలో మరియు వివిధ సందర్భాల్లో ప్రజలకు కలిగిన ఇబ్బందులను తెలుసుకుని అండగా నిలబడుతూ,కష్ట సమయాలలో ఆదుకున్నారు. అందుకు నిదర్శనమే కొన్ని ప్రత్యేక వేదికల్లో ఉత్తమ మహిళగా,వ్యాపారవేత్తగా అవార్డులు పొందారు. ఈసందర్భంగా కళ్యాణి మరింత ఉన్నతమైన పదవులు అధిరోహించాలని కోరుకుంటూ అభిమానులు కోరుకుంటూ అభినందనలు తెలియజేస్తున్నారు.

# ఇరాన్‌తో మళ్లీ చర్చిస్తాం.. కానీ, 2 షరతులు

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందంపై నిర్ణయం తీసుకోవడానికి వీలుగా ఐఆర్జీసీ నుంచి అనుమతులు తెచ్చుకోవాలి. ఈ రెండు నిబంధనలకు టెహ్రాన్ అంగీకరిస్తే శాంతి చర్చలకు తాము సిద్ధమేనని అమెరికా తెలిపింది' అని సదరు మీడియా కథనం పేర్కొంది. అయితే, దీనిపై అమెరికా, ఇరాన్ నుంచి అధికారిక ప్రకటనేదీ రాలేదు. ఇదిలాఉండగా.. శాంతి చర్చలకు సంబంధించి ఇరాన్ పాలకవర్గంలో విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. చర్చల సమయంలో అమెరికా అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ఇరాన్ ప్రతినిధుల బృందానికి ఐఆర్జీసీ అనుమతినివ్వలేదని సమాచారం. దీనిపై ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ అసంతృప్తిగా ఉన్నట్లు సదరు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కారణంగానే డీల్ కోసం ఐఆర్జీసీ అనుమతి తీసుకోవాలని అమెరికా రెండో షరతు పెట్టినట్లు తెలిపాయి.

# నేటి నుంచి డిజిటల్ జనగణన 2027 ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

పర్యవేక్షణలో కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నోడల్ అధికారిగా ఉంటారన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్/మున్సిపల్ కమిషనర్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్‌గా, మండల స్థాయిలో తహసీల్దార్/మున్సిపల్ కమిషనర్ చార్జ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారన్నారు. రాష్ట్రంలోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డుల సిబ్బంది మరియు అవసరమైతే ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లుగా పనిచేస్తారన్నారు. జనగణనను రెండు దశల్లో నిర్వహిస్తారని, మొదటి దశగా హౌస్ లిస్టింగ్ మరియు హౌసింగ్ సెన్సస్ (నూ) ద్వారా గృహాల పరిస్థితులు, సౌకర్యాలు, ఆస్తులపై సమాచారం సేకరిస్తారన్నారు. రెండవ దశగా పాపులేషన్ ఎన్యూమరేషన్ ద్వారా జనాభా, సామాజిక, ఆర్థిక, వలసలు, జనన వివరాలు సేకరించడం జరుగుతుందని, ఈ రెండవ దశలోనే కుల గణన కూడా చేపడతారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలనా యూనిట్ల గణాంకాల ప్రకారం, వఅఖ 2027 నాటికి రాష్ట్రంలో 28 జిల్లాలు, 669 మండలాలు, 83 స్టాట్యుటరీ టౌన్లు, 228 సెన్సస్ టౌన్లు ఉన్నాయన్నారు. గ్రామాల సంఖ్య సుమారు 16,862 గా నమోదైందన్నారు. ఈ పరిపాలనా నిర్మాణం ద్వారా జనగణన సమర్థవంతంగా నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు.

మొదటి దశలో భాగంగా స్వీయ-గణన సదుపాయం 16.04.2026 నుండి 30.04.2026 వరకు 15 రోజులపాటు అందుబాటులో ఉంటుందన్నారు. అనంతరం ఇండ్ల జాబితా ఇం డ్ల గణన 01.05.2026 నుండి 30.05.2026 వరకు 30 రోజులపాటు నిర్వహించబడుతుందన్నారు. ప్రజలు పోర్టల్ ద్వారా తమ మొబైల్ నంబర్‌తో లాగిన్ అయ్యి, గృహాన్ని జియో-ట్యాగ్ చేసి వివరాలు నమోదు చేయవచ్చన్నారు. నమోదు పూర్తయిన తర్వాత ఒక ప్రత్యేకమైన జనరేట్ అవుతుందని, ఈ రాజు ణ ను ఎన్యూమరేటర్‌కు అందజేసి, ఫీల్డ్ వెరిఫికేషన్ సమయంలో ధృవీకరించాల్సి ఉంటుందన్నారు.

హౌస్ లిస్టింగ్ దశలో మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను పొందుపర్చాల్సి ఉంటుందని, ఇందులో గృహ నిర్మాణ పదార్థాలు (ఫ్లోర్, గోడ, పైకప్పు), గృహ వినియోగం, గృహ స్థితి, కుటుంబ సభ్యుల సంఖ్య, కుటుంబ యజమాని వివరాలు, స్థితి, గదుల సంఖ్య, వివాహిత జంటలు వంటి అంశాలు ఉంటాయన్నారు. అదనంగా త్రాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వంట ఇంధనం, స్నాన సౌకర్యం, వంటగది వంటి సౌకర్యాలు నమోదు చేస్తారన్నారు. కుటుంబ ఆస్తులు (టీవీ, ఇంటర్నెట్, మొబైల్, వాహనాలు), ప్రధాన ఆహారం, మొబైల్ నంబర్ వంటి వివరాలు కూడా నమోదు చేయబడతాయన్నారు.

జనగణన 2027 కోసం విస్తృత సన్నాహాలు చేపట్టబడ్డాయని, 01.01.2026 నాటికి పరిపాలనా యూనిట్లు స్థిరీకరించబడ్డాయన్నారు. నవంబర్ 2025లో అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో ప్రీ-టెస్ట్ నిర్వహించడం జరిగిందన్నారు. 2026లో ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర నోడల్ అధికారులు మరియు ఇతర ఉన్నతాధికారులతో పలు సమావేశాలు నిర్వహించబడ్డాయని, జిల్లా మరియు చార్జ్ స్థాయిలో సిబ్బంది నియామకం పూర్తయిందన్నారు. ఈసారి జనగణన పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతుందని, అంతీశీఱఎ మరియు ఱూూ మొబైల్ యాప్‌ల ద్వారా డేటా సేకరణ జరుగుతుందన్నారు. ఈ యాప్‌లు 16 భాషల్లో అందుబాటులో ఉండి, ఆఫ్‌లైన్‌లో కూడా పనిచేస్తాయన్నారు. డేటా సేకరణలో అఆ-ఎఆశ్రీ జశ్రీఅఎఔశీఅ ఎష్టవఎఎం ఉండటంతో ఖచ్చితత్వం పెరుగుతుందన్నారు. వెబ్ ఆధారిత పోర్టల్ ద్వారా మొత్తం ప్రక్రియను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లు వెబ్ మ్యాపింగ్ ద్వారా రూపొందించామన్నారు.



## పేదలకు పట్టెడన్నం... చంద్రన్న సంకల్పం

(మొదటి పేజీ తరువాయి)

క్యాంటీన్లు నడుస్తున్నాయి. త్వరలో మరో 5 అన్న క్యాంటీన్లను ప్రారంభించాలని నిర్ణయించారు. గడచిన 21 నెలల్లో 8.80 కోట్ల భోజనాలను పేదలకు అందించామని సీఎం తెలిపారు. ప్రతీ రోజూ ఒక్కో అన్న క్యాంటీన్ లో సగటున 1013 మందికి భోజన సదుపాయం కల్పిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లలో పేదలకు భోజన వసతి కోసం రూ.243 కోట్లు వెచ్చించారు.

# దండుగ పని

**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** పశ్చిమాసియాలో జరుగుతోన్న యుద్ధం వల్ల అమెరికా సైన్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దీంతో ఇరాన్ పై దాడులను సొంత పౌరులు కూడా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ యుద్ధం వల్ల తమకు ఎలాంటి ప్రయోజనం లేదంటూ 54శాతం మంది అమెరికన్లు భావిస్తున్నారు. ఈ మేరకు ఇటీవల ఇప్సాస్-రాయిటర్స్ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది.

గత కొన్ని వారాలుగా ఇరాన్ పై యుద్ధం సాగిస్తోన్న అమెరికా.. తాజాగా హర్మూజ్ జలసంధిని దిగ్బంధించింది. అయితే, ఈ చర్యలను 54శాతం మంది అమెరికన్లు వ్యతిరేకిస్తున్నట్లు సర్వేలో తేలింది.

ఈ దాడులతో వారి ఆర్థికవ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని వారు అభిప్రాయం వ్యక్తంచేశారు. 65శాతం మంది డెమోక్రాట్లు, 56శాతం మంది ఇండిపెండెంట్లు, 40శాతం రిపబ్లికన్లు ఈ సర్వేలో తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఇరాన్ పై అమెరికా సైనిక చర్య సరైందేనని 24 శాతం మంది సమర్థించినట్లు సర్వే తెలిపింది. మరో 22 శాతం మంది అసలు దీనిపై స్పందించడానికే ఇష్టపడలేదట. ఇక, ట్రంప్ రిపబ్లికన్ పార్టీలోనూ 54శాతం మంది యుద్ధానికి అనుకూలంగా ఉండగా.. మిగతా వారు వ్యతిరేకిస్తున్నట్లు సర్వే పేర్కొంది. మొత్తానికి ఈ సర్వేతో రిపబ్లికన్ పార్టీలో చీలికలు ఏర్పడతాయనే అంచనాలు వెలువడుతున్నాయి.

## హర్మూజ్‌లో అమెరికా నిఘా డ్రోన్

**టెహ్రాన్, ఏప్రిల్ 15:** ఇరాన్ తో యుద్ధంలో అమెరికా 238 మిలియన్ డాలర్ల (రూ.2,222 కోట్ల) విలువైన నిఘా డ్రోన్ కూలిపోయింది. ఏప్రిల్ 9న హర్మూజ్ జలసంధిలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. దీనిపై ఎటువంటి దాడి జరగలేదని.. సాంకేతిక లోపంతో కూలిపోయినట్లు పేర్కొంది.

అంతర్జాతీయ గగనతలంలో హర్మూజ్ జలసంధి పై గస్తీలో ఉండగా ట్రైటన్.. అకస్మాత్తుగా ఎమర్జెన్సీ కోడ్ను రిలీజ్ చేసింది. ఆ తర్వాత 50వేల అడుగుల ఎత్తు నుంచి 10వేల అడుగుల ఎత్తుకు దిగొచ్చింది. అనంతరం కనిపించకుండా పోయింది. నేవీ సేఫ్టీ కమాండ్ దీనిని క్లాస్-ఏ ప్రమాదంగా వర్గీకరించింది. 2 మిలియన్ డాలర్లకుపైగా నష్టాన్ని, ఎయిర్ క్రాఫ్ట్ పూర్తిగా ధ్వంసం కావడాన్ని దీనికింద పరిగణిస్తారు. తాజాగా ఈ ప్రమాదాన్ని ధ్రువీకరించిన అమెరికా.. ఏ ప్రాంతంలో జరిగిందో మాత్రం వెల్లడించలేదు.

ట్రైటన్.. అమెరికా నేవీ ఆయుధశక్తిలో ఈ అధునాతన మానవరహిత వైమానిక వ్యవస్థల్లో ఒకటి. అధిక ఎత్తులో వ్యూహాత్మక జలమార్గాల్లో మారిటైమ్ ట్రాఫిక్, మిలిటరీ కదలికలను పర్యవేక్షించడంలో ఇది కీలకం. ఇప్పుడు దీనిని కోల్పోవడం అనేది యూఎస్ నేవీకి గట్టి దెబ్బే అని చెప్తున్నారు. ఇక, అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించిన అనంతరం ఈ ఘటన జరగడం గమనార్హం.

# ప్రతిరోజు తాగునీటి శాంపిల్ సేకరించి తనిఖీలు నిర్వహించాలన్న నగర కమిషనర్



**గుంటూరు, నగరపాలక సంస్థ ఏప్రిల్ 15 (మనం న్యూస్ ప్రతినిధి):** నగరంలో త్రాగునీటి సరఫరా జరుగు సమయంలో ప్రతి రోజు ప్రతి రిజర్వాయర్ పరిధిలో తప్పనిసరిగా త్రాగునీటి శాంపిల్స్ నూరు శాతం జరగాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజనీరింగ్ కారులను ఆదేశించారు.బుదవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులు సిబ్బందితో సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు తీరు పై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,నగరంలో అన్ని రిజర్వాయర్ల పరిధిలో ప్రతి రోజు త్రాగునీటి సరఫరా సమయంలో శాంపిల్స్ సేకరించి తనిఖీ చేయాలన్నారు. త్రాగునీటి కాలుష్యం జరిగితే ప్రజల ఆరోగ్యానికి తీవ్ర సమస్యలు వస్తాయని, డ్రైన్ ని క్రాస్ చేసి ఇంటికి త్రాగునీరు అందే ప్రతి పైప్ లైన్లను ఈ నెలాఖరు నాటికి తప్పని సరిగా మార్చుకోవాల్సిందేనన్నారు. నగరంలో ఉన్న బోర్ వేల్స్ మరమ్మతులకు లోనై ఉంటె శనివారం నాటికి వాటికి మరమ్మతులు నిర్వహించాలన్నారు. పబ్లిక్ టాయిలెట్స్ మరమ్మతులు ఏమైనా ఉంటె వెంటనే వాటికి మరమ్మతులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అభివద్ధి పనులు పూర్తైన వెంటనే బిల్లుల చెల్లింపుకు నిధి పోర్టల్ లో అప్ లోడ్ చేయాలన్నారు. నగరంలోని ప్రతి స్మశానవాటికలో మౌలిక వసతుల కల్పన చేయుటకు సంబంధిత ఏ.ఈలు వారి పరిధిలోని స్మశానవాటికలలో పర్యటించి సమస్యలను గుర్తించి, అవసరమైన మౌలిక సదుపాయాలు కలిపించాలన్నారు.అలాగే నగర పాలక సంస్థ పార్కులలో అనుమతించిన అభివద్ధి పనులను,జియంసి ఓపెన్, రిజర్వ్ సైట్లలో పార్కులను అభివద్ధి చేయాలన్నారు. నగరంలో ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో జియంసి చలివెంద్రాలను త్వరితగతిన ఏర్పాటుకు చేశామని, ఇంకా అవసరమైన ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు.నగరంలోని ప్రధాన అవుట్ ఫాల్ డ్రైన్లలో డీసిల్టింగ్ పనులు సోమావారం నుండి అన్ని డివిజన్లలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వర్షాకాల ముందస్తు కార్యాచరణ ప్రణాళిక క్రింద ఆమోదించిన పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. సమావేశంలో ఈఈలు సుందర రామిరెడ్డి, వేణు, విష్ణు, డిఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## 50 శాతం సీట్లు పెంచుతరు

(మొదటి పేజీ తరువాయి)

పెరగనున్నాయి. దీనివల్ల పెద్ద రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు కూడా ప్రాతినిధ్యం పెరుగుతుంది. పునర్విభజన విధివిధానాలు బిల్లులో స్పష్టంగా ఉన్నాయని, చట్టపరమైన ప్రక్రియ ప్రకారమే ఇది జరుగుతుందని సమాచార శాఖ పేర్కొంది. ఈ అంశంపై పార్లమెంటులో జరిగే చర్చ సందర్భంగా పూర్తిస్థాయిలో క్లారిటీ ఇస్తామని, విపక్షాల సందేహాలను నివృత్తి చేస్తామని కేంద్రం ప్రకటించింది. నియోజకవర్గాల సంఖ్య 50 శాతం పెరగడం వల్ల దేశవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాల సంఖ్య భారీగా పెరగనుంది. దీనివల్ల అటు లోక్సభలో, ఇటు అసెంబ్లీలలో నూతన నాయకత్వానికి అవకాశం లభిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## టీడీపీ పొలిట్ బ్యూరో ఎక్స్ అఫిషియో మెంబెర్‌గా నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కష్ణ దేవరాయలు

(మొదటి పేజీ తరువాయి)

అందులో నారా లోకేష్, పల్లా శ్రీనివాసరావు , లావు శ్రీ కష్ణ దేవరాయలు ఉన్నారు. ఈ పదవి ద్వారా పార్టీ వ్యవహారాల్లో శ్రీ కష్ణ దేవరాయలు కీలకంగా వ్యవహరించనున్నారు.

# చమురు ధరలు భారీగా తగ్గుతయ్

(మొదటి పేజీ తరువాయి)

చెప్పలేదన్నారు. ఇరాన్ యుద్ధం త్వరలో ముగిసే అవకాశం ఉందన్నారు.

నవంబర్లో ఎన్నికలు వచ్చే సమయానికి చమురు ధరలు భారీగా పడిపోతాయన్నారు.

**డ్రాగన్‌కు హ్యాపీగా ఉంది...**

చైనా హ్యాపీగా ఉందంటూ ట్రంప్ ట్రూత్లో పోస్ట్ చేశారు. త్వరలో హర్మూజ్ జలసంధిని శాశ్వతంగా తెరవనున్నట్లు పేర్కొన్నారు.

దీని వల్ల చైనాతో పాటు ప్రపంచమంతా లాభపడుతుందని వ్యాఖ్యానించారు. ఇరాన్కు ఆయుధాలు ఇవ్వకుండా ఉండేందుకు బీజింగ్ అంగీకరించిందన్నారు.

ఆ దేశాధ్యక్షుడు జిన్పింగ్, తాము కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. కొద్ది రోజుల్లోనే ఆయన్ను కలుస్తానన్నారు. అదే సమయంలో యుద్ధం చేయడంలో అమెరికాను మించిన దేశం మరొకటి లేదనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని మరోసారి తన మాటలను పునరుద్ఘాటించారు.

# డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా ఓటేస్తం

(మొదటి పేజీ తరువాయి)

కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. ఖర్గే నివాసంలో నిర్వహించిన మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంబఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్ తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్లో ఐక్యంగా పోరాడుతామని ఖర్గే పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు.

కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు.

మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్ తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

## రాయపూడి సిఆర్డిఏ ఎదుట అన్న క్యాంటీన్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ధనుంజయతో కలసి కమిషనర్, అన్నక్యాంటీన్లో భోజనం చేశారు. రాయపూడిలో ఎపిసిఆర్డీఏ ప్రధాన కార్యాలయంతో పాటు మున్సిపల్ శాఖ పరిధిలోని పలు కార్యాలయాలు కొలువుదీరిన నేపథ్యంలో అన్నక్యాంటీన్ ఏర్పాటు కావడంతో ఆయా కార్యాలయాలలో పని చేసే సిబ్బంది, కార్మికులకు వెసులుబాటు కలగనుంది.

# అప్పుల ఊబిలో పాక్.. ఆదుకున్న సౌదీ

(మొదటి పేజీ తరువాయి)

యూఏఈ నుంచి తీసుకున్న రుణంలో దాదాపు 3.5 బిలియన్ డాలర్లు ఈ నెలలో తిరిగి చెల్లించాల్సి ఉంది. దీంతో విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇటువంటి కీలక సమయంలో తమకు ఆర్థిక భరోసా లభించిందని పాకిస్థాన్ మంత్రి ముహమ్మద్ ఔరంగజేబ్ పేర్కొన్నారు. తమ విదేశీ మారక నిల్వలను బలోపేతం చేసుకోవడంలో ఇవి దోహదపడతాయన్నారు. వాషింగ్టన్లో జరుగుతున్న ప్రపంచబ్యాంక్-ఐఎంఎఫ్ సమావేశాల్లో భాగంగా సౌదీతో ఈ ఒప్పందం కుదిరిందన్నారు.

## బీహార్ సీఎంగా సమ్రాట్ చౌదరి ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమంలో బీజేపీకి చెందిన కీలక నాయకులు, కూటమి భాగస్వాములు పాల్గొన్నారు. బీహార్లో బీజేపీ నుంచి సీఎం పదవి చేపట్టిన తొలి నాయకుడిగా సమ్రాట్ చౌదరి రికార్డు సృష్టించారు. రాజ్యసభకు ఎన్నికైన జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్ మంగళవారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమ్రాట్ కు ఆ పదవి కట్టబెట్టేందుకు బీజేపీకి మొగ్గు చూపింది. ఈ క్రమంలోనే తాజాగా సమ్రాట్ బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరి ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు.

# బుర్జ్ ఖలీఫాలోనూ డ్రగ్స్ పార్టీలు

**హైదరాబాద్, ఏప్రిల్ 15(మనం ప్రత్యేక ప్రతినిధి):** మొయినాబాద్ డ్రగ్స్ కేసులో తవ్వే కొద్ది సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో తాజాగా సినీ నిర్మాత కేదార్ పేరు తెరమీదకు వచ్చింది. గతేడాది డ్రగ్స్ ఓవర్‌డోస్‌తో దుబాయ్‌లో కేదార్ మరణించిన విషయం విదితమే. కాగా కేదార్‌తో పైలెట్ బ్రదర్స్‌కు మధ్య భారీ ఎత్తున లావాదేవీలు జరిగినట్లు సిట్ విచారణలో తేలింది. కేదార్‌కు పైలెట్ బ్రదర్స్‌తో పాటు చాలామంది డ్రగ్ పార్టీ నిర్వాహకులకు అనేక సార్లు డబ్బులు పంపినట్టు సిట్ ఆధారాలు సేకరించింది. ఈక్రమంలో పైలెట్ బ్రదర్స్ బ్యాంక్ ఖాతాల నుంచి కేదార్‌కు రూ. 25 లక్షలు రూపాయలు లావాదేవీ జరిగిన వైనంపై రోహిత్ రెడ్డి, రితేష్‌లను ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని వివరించారు. కాగా నిందితుల కస్టడీ పొడిగింపు పిటిషన్‌లో ఈ అంశాలను పోలీసులు పేర్కొన్నారు.

**ఎల్లలు దాటిన 'మత్తు':**

మొయినాబాద్ డ్రగ్స్ కేసులో పైలెట్ బ్రదర్స్ విదేశాలలో డ్రగ్స్ పార్టీలు నిర్వహించినట్లు తేలింది. తరచూ దుబాయ్ పర్యటనలు, అక్కడ వ్యాపార సంబంధాలు ఏర్పరచుకోవడం కోసం మత్తు పార్టీలు ఏర్పాటు చేసి ప్రముఖులతో చిందులేసినట్లు సిట్ అనుమానిస్తోంది. గడచిన ఆరు నెలల్లో పైలెట్ సోదరులు దాదాపు 10 సార్లు దుబాయ్ ట్రిప్స్‌కు వెళ్లారని, ముఖ్యంగా దుబాయ్‌లో 28 అంతస్తుల కమర్షియల్ ప్రాజెక్ట్ ప్లాన్ చేసినట్లు సిట్ విచారణలో ప్రాథమిక ఆధారాలు లభించాయి. అదేవిధంగా బుర్జ్ ఖలీఫాలో డ్రగ్స్ పార్టీలు నిర్వహించారని, యూకే, అమెరికా, ఆఫ్రికా (జాంబియా) దేశాల్లోనూ వ్యాపార లావాదేవీలు విస్తరించేందుకు పైలెట్ బ్రదర్స్ ప్రయత్నాలు చేసినట్టు సిట్ విచారణలో తేలింది. కాగా ఈ కేసులో మత్తు మూలాలతో పాటు అంతర్జాతీయ సంబంధాలను వెలుగులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందానికి బాధ్యతలు అప్పగించింది.

## దంచుతున్న ఎండలు

### వడగాలులు కూడా ఎక్కువేనని హెచ్చరించిన ఐఎండీ

**హైదరాబాద్, ఏప్రిల్ 15:** రాష్ట్రవ్యాప్తంగా 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న మూడు రోజులు ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మూడ్రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

ఈ నేపథ్యంలోనే ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్ తోపాటు ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

## కేరళ ఆలయానికి రోబోటిక్ ఏనుగు

**త్రిసూర్, ఏప్రిల్ 15:** కేరళలోని దేవాలయానికి పెటా ఇండియా-అనితా డోంగ్రే ఫౌండేషన్ సంయుక్తంగా భారీ రోబోటిక్ ఏనుగు ను బహుమతిగా ఇచ్చింది.త్రిసూర్లోని శ్రీభద్రకాళీ విష్ణుమాయా ఆలయానికి 'పున్నక్కపరంబిల్ మహాదేవన్' అనే యాంత్రిక ఏనుగును అందజేసినట్లు పెటా ప్రకటించింది. మలయాళ నూతన సంవత్సరమైన విషు వేడుకల సందర్భంగా.. భక్తుల సమక్షంలో దీనిని ఆవిష్కరించినట్లు తెలిపింది. ఆలయంలో నిర్వహించే వేడుకల్లో ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా.. సురక్షితంగా నిర్వహించుకోవడానికి వీలుగా దీనిని ఉపయోగించనున్నట్లు పేర్కొంది. కేరళ వ్యాప్తంగా వివిధ ఆలయాలకు పెటా అందించిన రోబోటిక్ ఏనుగుల్లో 'పున్నక్కపరంబిల్ మహాదేవన్' 14వది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా వివిధ ఆలయాలకు 25 రోబోటిక్ ఏనుగులను బహుమతిగా ఇచ్చినట్లు పెటా తెలియజేసింది.

# తిరుపతి, చంద్రగిరిలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేష్





- **తిరుపతిలో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను ప్రారంభించిన మంత్రి నారా లోకేష్**

**తిరుపతి,ఏప్రిల్ 15,మనం న్యూస్ :** తిరుపతిని స్పోర్ట్స్‌హబ్ గా తీర్చిదిద్దుతామనే యువగళం హామీ కార్యరూపం దాలుస్తోంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఏడాదిలో రూ.35 కోట్లకు పైగా నిధులు కేటాయించడం జరిగింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తిరుపతి పట్టణం గొల్లవానిగుంటలో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ క్రికెట్ పెవిలియన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అకాడమీలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. శాప్, తుడా సహకారంతో రూ.10.10 కోట్ల నిధులు వెచ్చించి ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను నిర్మించారు. ముందుగా క్రీడా ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ తో పాటు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ అకాడమీలను మంత్రి లోకేష్ ప్రారంభించారు. క్రీడా ప్రాంగణం మొత్తం కలియతిరిగారు. ఈ సందర్భంగా క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ క్రీడాకారులతో గ్రూప్ ఫోటో దిగారు. కొద్దిసేపు వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఎన్టీఆర్ క్రికెట్ స్టేడియంతో పాటు ఎన్టీఆర్ క్రికెట్ పెవిలియన్ ను ప్రారంభించారు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాల్ రాజ్, ఇతర క్రీడాకారులతో కలిసి కొద్దిసేపు క్రికెడ్ ఆడారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులతో సంభాషించి వారిని ఉత్సాహపరిచారు. క్రీడా ప్రాంగణంలో ప్రణీత్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ ను మంత్రి ప్రారంభించారు. ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను క్రికెట్ మైదానం, ఖోఖో, కబడ్డీ, ఖఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ కోర్టులతో పాటు పలు క్రీడా సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. ఈ సముదాయం క్రీడా సంస్క ృతిని ప్రోత్సహించడంతో పాటు ఈ ప్రాంత భవిష్యత్ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించనుంది. అంతకుముందు తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో రూ.5.35 కోట్ల వ్యయంతో కరణం మల్లీశ్వరి వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ, 200 మంది క్రీడాకారులకు వసతి సదుపాయం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన జూనియర్ బాక్సింగ్ రింక్ ను ప్రారంభించారు. గూడూరు నియోజకవర్గం కోటలో రూ.2.31 కోట్ల వ్యయంతో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం, సూళ్లూరుపేటలో రూ.2.70 కోట్ల వ్యయంతో క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. రేణిగుంట ఏపీఎస్టీఆర్ఈఐఎస్ స్కూల్ లో రూ.80 లక్షల వ్యయంతో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రవాణ, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సి.షణ్ముగ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ శ్రీపతి బాబు, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, సూర్య చరిష్మ తమిరి, దండు పూజ, నవ్య కందేరి, భారత అంధ క్రికెటర్ ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి, అంధ మహిళా క్రికెటర్ పంగి కరుణ కుమారి, పారా అథ్లెట్ రవి రంగలి, పారా సైక్లిస్ట్ షేక్ అర్షద్, పారా అథ్లెట్ కె.లలిత, ఆర్చరీ ప్లేయర్ టి.గణేష్ మణిరత్నం, భారత హాకీ క్రీడాకారిణి రజని ఇటిమరపు తదితరులు పాల్గొన్నారు.....

## శరవేగంగా వెలిగొండ పనులు..

### త్వరలో ప్రాజెక్టు పూర్తి

**బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డా. ఏలూరి రామచంద్రారెడ్డి**



**మార్కాపురం.ఏప్రిల్,15,మనం న్యూస్ :** ఉమ్మడి ప్రకాశం జిల్లా తో పాటు నెల్లూరు, కడప జిల్లాలకు వరప్రదాయిని అయిన శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం శరవేగంగా పూర్తి చేయడానికి కట్టుబడి ఉందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ప్రతి రెండు నెలలకోసారి వెలిగొండ ప్రాజెక్టు టన్నెళ్లను సందర్శిస్తూ, పనులు జరుగుతున్న తీరును సమీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ప్రాజెక్టును సందర్శించి, పెండింగ్లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తు చేశారు. ఈ ప్రాంత అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, అందులో భాగంగానే మార్కాపురాన్ని జిల్లాగా ఏర్పాటు చేయడం, అలాగే వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం ప్రభుత్వం పనితీరుకు నిదర్శనమని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన ఆర్ ఆర్ (రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్మెంట్) ప్యాకేజీని కూటమి ప్రభుత్వం త్వరలో ప్రకటించే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తరువాత ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని, తాగునీటి సమస్య కూడా పూర్తిగా తొలగిపోతుందని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడం ద్వారా 4.32 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందని, తద్వారా పంటల ఉత్పత్తి పెరిగి, రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## చంద్రగిరిలో నారా రామ్మూర్తినాయుడు క్రీడా వికాస కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి లోకేష్

**చంద్రగిరి,ఏప్రిల్ 15,మనం న్యూస్ :** తిరుపతి జిల్లా చంద్రగిరిలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన నారా రామ్మూర్తినాయుడు క్రీడా వికాస కేంద్రాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ముందు క్రీడా ప్రాంగాణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు హాకీ క్రీడాకారుల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం నారా రామ్మూర్తినాయుడు మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియాన్ని మంత్రి ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్ తో కలిసి బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు. చిన్నారులతో టేబుల్ టెన్నీస్, హాకీ ఆడారు. వారితో కలిసి ఫోటోలు దిగారు. సీఎం చంద్రబాబు నాయుడు గారి సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు జ్ఞాపకార్థం ఆయన పేరిట రూ.3.17 కోట్లు వెచ్చించి ఈ క్రీడా వికాస కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. జాతీయస్థాయిలో క్రీడలు నిర్వహించుకునేందుకు వీలుగా ఈ కేంద్రాన్ని నిర్మించారు. సీఎం చంద్రబాబు గారు విద్యాభ్యాసం చేసిన పాఠశాలలో క్రీడా వికాస కేంద్రాన్ని 2017లో మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో పనులు నిలిచిపోవడంతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక



చొరవ తీసుకుని క్రీడా వికాస కేంద్రాన్ని తీర్చిదిద్దారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, క్యారమ్స్, టేబుల్ టెన్నీస్, స్కిప్పింగ్, చెస్, జిమ్, యోగా వంటి క్రీడా సదుపాయాలు, అవుట్ డోర్ లో వాలీబాల్, కబడ్డీ, కోకో, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు హాకీ క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తీసుకుతెచ్చారు. ఈ క్రీడా వికాస కేంద్రం చంద్రగిరి పరిసర ప్రాంతాల క్రీడాకారులకు శిక్షణ, అభివృద్ధికి వేదికగా నిలవనుంది.

ఈ కార్యక్రమంలో ఏపీ రవాణ, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సి.షణ్ముగ రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చంద్రగిరి నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ శ్రీపతి బాబు, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, దండు పూజ, భారత హాకీ క్రీడాకారిణి రజని ఇటిమరపు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు

- **జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**



**చిత్తూరు, ఏప్రిల్ 15,మనం న్యూస్ :** జిల్లాలో అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డుల మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన కమిటీ మూడవ సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో కన్వీనర్, ఎన్ వేలాయుధం, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల మేరకు, అర్హత కలిగిన ప్రతి ఒక్క ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. దశలవారీగా కమిటీ సమావేశాలు నిర్వహించి అక్రిడేషన్ కార్డులు మీడియా ప్రతినిధులకు అందజేయడం జరుగుతుంది. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 302 మంది మీడియా ప్రతినిధులకు అక్రిడేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈరోజు ప్రింట్ 56మరియు ఎలక్ట్రానిక్ మీడియాకు,19 మందికి 4 మాస పత్రికలకు మొత్తం 79 మీడియా ప్రతినిధులకు ఈరోజు కమిటీలో ఆమోదించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు, ఎస్ గంగాధర్, జి రమేష్ బాబు, ఏ బాలాజీ, లక్ష్మీపతి, హరి ప్రసాద్, పి రాజేంద్ర నాయుడు, పి చంద్ర ప్రకాష్, జగదీష్, వై కాళేశ్వర్ రెడ్డి, డి ఎమ్ హ్ వో నాగ శశి భూషణ్ రెడ్డి, ఆర్టీసి పర్సనల్ ఆఫీసర్ షహజ్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల, ఏప్రిల్ 15,మనం న్యూస్ :** తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. బుధవారం వేకు జామున ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా నటుడు సోను సూద్ మాజీ మహిళా క్రికెటర్ మిథాలీ రాజ్ దర్శించుకున్నారు సుప్రభాత సేవలో బ్యాట్మెంటన్ క్రీడాకారుడు శ్రీకాంత్ దర్శించుకున్నారు వీఐపీ దర్శన సమయం లో నటి సంయుక్తా మీనన్ దర్శించుకున్న వారిలో ఉన్నారు వీరికి శ్రీవారి ఆలయ అధికారులు రంగనాయక మండలంలో వేద ఆశీర్వ చనం చేయించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## టీటీడీకి బ్యాటరీ బగ్గీ విరాళం


తిరుమల, ఏప్రిల్ 15,మనం న్యూస్: కర్ణాటక రాష్ట్రం కోలార్ కు చెందిన హైడ్రోకార్ట్ టెక్నో సొల్యూషన్స్ సంస్థ ఎండీ గణేష్ జయవేల్ రూ.10 లక్షలు విలువైన బ్యాటరీ బగ్గీ వాహనాన్ని బుధవారం విరాళంగా అందించారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయం ఎదురుగా వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి తాళాలను పేష్కార్ రామకృష్ణకు అందజేశారు.



## ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ను సందర్శించిన ఢిల్లీ ముఖ్యమంత్రి

**తిరుమల, ఏప్రిల్ 15,మనం న్యూస్ :** ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖా గుప్తా బుధవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం అనంతరం వైకుంఠం క్యూ కాంప్లెక్స్లో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ను సందర్శించారు. ఈ సందర్భంగా టీటీడీ అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరి ఆమెకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును వివరించారు. భక్తుల రద్దీని సమర్థవంతంగా పర్యవేక్షించడానికి ఉపయోగిస్తున్న ప్రెడిక్టివ్ అనలిటిక్స్ విధానాన్ని వివరించారు. అలాగే లడ్డూ ప్రసాదం తయారీ, ట్రాఫిక్ నిర్వహణ, వసతి సదుపాయాల సమన్వయం వంటి అంశాల్లో ఈ సెంటర్ పనితీరును కూడా వివరించారు. భక్తుల భద్రతకు టీటీడీ చేస్తున్న కృషిని ఢిల్లీ ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

## అండమాన్ వద్ద పడవ బోలా



- **250 మంది గల్లంతు**
- **ఐక్యరాజ్యసమితి ప్రకటన**

**న్యూయార్క్, ఏప్రిల్ 15:** అండమాన్ సముద్రంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తోన్న ఓ పడవ మునిగిపోయింది. ఘటనలో దాదాపు 250 మంది గల్లంతయ్యారు. వారి కోసం సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ల నుంచి సంయుక్త ప్రకటన వెలువడింది. ఈ పడవ దక్షిణ బంగ్లాదేశ్ లో టేక్నాఫ్ ప్రాంతం నుంచి బయల్దేరినట్లు ఈ ప్రకటనలో ఐరాస అధికారులు పేర్కొన్నారు. మలేసియా వెళ్తుండగా బలమైన ఈదురుగాలులు, కెరటాల ఉద్ధ ృతి కారణంగా మునిగినట్లు వెల్లడించారు. కాగా ఈ పడవలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించారని, అది కూడా ప్రమాదానికి కారణమై ఉండొచ్చని తెలిపారు.

ఈ పడవ ఏప్రిల్ 4న బంగ్లాదేశ్ నుంచి బయల్దేరినట్లు తెలుస్తోంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదుపాయాల కోసం మలేసియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఐరాస అధికారులు వెల్లడించారు. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌కు చెందినవారు. కానీ, 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దీంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే, ఇటీవల ఇక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వీరంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

## సామాజిక మాధ్యమాల్లో తిరుమలలో దర్శనాలు, గదుల పేరుతో భక్తులను మోసగిస్తున్నవారిపై కఠిన చర్యలు

- **భక్తులకు టీటీడీ విజ్ఞప్తి**

**తిరుమల, ఏప్రిల్ 15,మనం న్యూస్ :** ఇటీవల కాలంలో తిరుమలలో దర్శనాలు, గదులు ఇప్పిస్తామంటూ కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో భక్తులను నమ్మబలికి మోసగించి డబ్బులు వసూలు చేస్తున్న విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగింది.దీనిలో భాగంగా నిన్న టీటీడీ విజిలెన్స్ వారి సహకారంతో, పోలీసుల సమన్వయంతో సోషియల్ మీడియాలో శ్రావణ్ కళ తిరుమల, తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఐడీతో భక్తులను మోసగిస్తున్న చిత్తూరుజిల్లా పెనుమూరుకు చెందిన కామసాని పవన్ కుమార్ అలియాస్ నాగరాజు, బోడిరెడ్డి చెన్నకేశవులు అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించడం జరిగేలా చేయడం జరిగింది.ఇటీవల సోషియల్ మీడియాలో భక్తులను మోసగిస్తున్న ఉందంతాల దృష్ట్యా భక్తులు అప్రమత్తంగా ఉండాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. టీటీడీ అధికారిక మాధ్యమాల ద్వారానే దర్శనాలు, గదులు బుక్ చేసుకోవాలని భక్తులను కోరడమైనది. ఎవరైనా తిరుమలలో దర్శనాలు, గదులు తీసి ఇస్తామని చెబితే నమ్మకూడదని భక్తులను కోరడమైనది. అలాంటి వ్యక్తుల సమాచారం తెలిస్తే టీటీడీ విజిలెన్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నెం:9866898630కు ఫిర్యాదు చేయాల్సిందిగా తెలియజేయడమైనది.

## ఒక అల్లకల్లోల హృదయం

ఈ రాతిరికి మాత్రమే తెలుసు ప్రియా
నీకోసం నేను పలికే మాటలు
ప్రతి రాత్రి తానొక్కతే మరీ వినేది
ప్రతీ రాత్రీ నీ పేరే పలికి నీ ఆలాపనే చేస్తుంటే
కొన్ని సార్లు ఎంతగా విసుక్కుంటుందో
కొన్ని సార్లు అంతగా కన్నీరు కారుస్తుంది

అనుమానమైతే
తెల్లవారి ఇంటిముందటి
పూల మొక్కల తాకి చూడు
తెల్లార్లు రాతిరిడిచిన కన్నీటి చెమ్మ
నీ మునివేళ్ళను ముద్దాడుతవి

ఆకాశం కేసి చూస్తానా
మిణుకు మిణుకు చుక్కలేవో
చెప్పాలనుకుంటున్నట్టు
అవి కన్నులను మిటకరిస్తూ
ఉంటవి కానీ
నీవు పక్కన లేకుంటే
చుక్కల భాష నాకెట్లా
అర్థమయ్యేది చెప్పు
ఎంత సొగసైన
భాషైతేమీ ఎంత ఆర్ద్రమైన
భావమైతేనేమీ
అర్థం కానప్పుడు
అర్థం కానీ భాష ఎప్పుడూ
మనకు పరాయిదే కదా !

నేను నీ గురించి
ఇట్లా ఆలోచిస్తున్నపుడే
దూరాన ఎక్కడో
బాంబుల శబ్దానికి జడిసి
దుఃఖిస్తున్న హృదయాల
ఘోష వినబడుతుంటే
అప్రయత్నంగా జారుతున్న కన్నీటి ధార
ఆకలితో పేగులు అరుస్తున్న అరుపులు
ఆ బాంబుల శబ్దాల్లో
అంతర్ధానమైనవి
నా కడుపులేదో దేవుతున్న భావన
ఇటుపక్కన మారణహోమాన్ని
వేడుక చేసుకునే
నేతల వెకిలి నవ్వుల
వికట్టహాసాల రొద
చెప్పు ప్రియా...
భూమ్మీద ఏడనైనా
ఏ భాషలోనైనా
ఒకేతీరుగా అర్థమయ్యేవి
దుఃఖం, ఆకలి, నవ్వు మాత్రమే కదా!

వాక్యాలన్నీ అసంబద్ధంగా పరుచుకున్నవి
ఇట్లా అసంబద్ధంగా
ఉంటే ఎట్లా అని పెదవి
విరుస్తున్నారు ఇప్పుడంతా
నీవైన చెప్పు వాళ్ళకి
హృదయం అల్లకల్లోలంగా ఉన్నపుడు
పదాలు మాత్రం పద్ధతిగా
ఎట్లా వస్తాయని!?
ఎప్పటిలాగే ఎప్పటిలాగే
నా తరపున వకాల్తా ఇవ్వు నేస్తం
అచ్చు సరిగా ఉంటేనే కదా
ఆకారం సరిగా వచ్చేదని...
వీరికెట్లా ఏం చెప్తే మాత్రం అర్థమవుతుంది
ప్రియా...
లోకమింత అసంబద్ధంగా సాగుతున్నా
ముసుగులేసుకున్న ఈ మనుషులు మాత్రం
అంతా పద్ధతిగానే నడవాలని
కోరుకుంటారు కదా!
ఛీ... ఈ యుద్ధాన్నైనా, ఏ అల్లకల్లోన్నాన్నైనా
ప్రేమ మాత్రమే నిలువరించగలదని
ప్రేమ మాత్రమే కుదుటపరుచగలదని
వీరికెట్లా చెబితే అర్థమవుతుంది
నీవు రా ప్రియా...
ప్రేమేమీ చేయగలదో
మన హృదయాల్ని అల్లుకుని చూపిద్దాం
మన హృదయాల సాక్షిగా శాంతిని
ఆహ్వానిద్దాం రా నేస్తం!!

**- దిలీప్.వి**
8464030808

## బుల్డోజరు

నీటి పదను ప్రజా జీవనం ధ్వంసం
దారి కావాలి
స్వార్థచింతన నగరం నీటి కుంట

చిత్తం మారాలి
చెరపట్టిన ఊరు కోదు చెరువు
విల్లాలు గుల్ల
వస్తాదు నేత ప్రకృతి కై జగడం
ప్రజల అండ
మార్పు మంచికి రేపటి తరాలకు
నేత ఉవాచ
హైడ్రా వచ్చింది భూ బకాసురుల లో
భయం తెచ్చింది

సత్యం చావదు భూదోపిడి సాగదు
తప్పదు శిక్ష
తాగు సాగుకు గొలుసు చెరువులు
సదా ఉండాలి

**- రేడియమ్**
9291527757

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
**manamlekhalu@gmail.com**
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

**ఈ పేపర్ కోసం**
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి

- ఎడిటర్

# చట్టసభల్లో పెరగనున్న మహిళా స్వరం

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళల రాజకీయ ప్రాతినిధ్యం అనేది కేవలం సంఖ్యాపరమైన మార్పు మాత్రమే కాదు, అది ఒక జాతి పునర్నిర్మాణ ప్రక్రియలో సగ భాగం గొంతుకను చట్టబద్ధం చేసే మహోన్నత ఆశయం. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ కర్తలు ఓటు హక్కు కల్పించినప్పుడే లింగ వివక్షకు తావులేదని స్పష్టం చేసినప్పటికీ, ఆ హక్కు చట్టసభల నిర్ణయాత్మక స్థానాల్లోకి ప్రతిబింబించడానికి దశాబ్దాల కాలం పట్టింది. ఈ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ కేంద్రం ప్రవేశపెట్టిన 'నారీ శక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ బిల్లు) భారత రాజకీయ చరిత్రలో ఒక నూతన శకాన్ని ఆవిష్కరిస్తోంది. లోక్‌సభ మరియు రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు ముప్పైమూడు శాతం స్థానాలను కేటాయించాలనే ప్రతిపాదన, కేవలం మహిళా సాధికారతకు చిహ్నం మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య నాణ్యతను పెంచే సంస్క రణగా నిలుస్తుంది. ఈ చారిత్రాత్మక పరిణామాన్ని లోతుగా విశ్లేషిస్తే, సామాజిక న్యాయం, రాజకీయ వ్యూహం మరియు భవిష్యత్ భారత్ పట్ల ఒక స్పష్టమైన దార్శనికత కనిపిస్తాయి.



మహిళా రిజర్వేషన్ల పోరాటం నిన్న మొన్నటిది కాదు. దీని వెనుక దాదాపు మూడు దశాబ్దాల సంఘర్షణ దాగి ఉంది. 1996లో అప్పటి ప్రధానమంత్రి హెచ్.డి. దేవెగౌడ నేతృత్వంలోని ప్రభుత్వం మొదటి సారిగా ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిన నాటి నుండి, అనేక రాజకీయ ఒడిదుడుకుల మధ్య ఇది నానుతూ వచ్చింది. ఆ తర్వాత వాజపేయి, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాలు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ, ప్రాంతీయ పార్టీల అభ్యంతరాలు, ఓబీసీ ఉప కోటా డిమాండ్లు మరియు రాజకీయ సంకల్పలోపం వల్ల ఈ బిల్లు చట్ట రూపం దాల్చలేకపోయింది. 2010లో రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం పొందినప్పటికీ, లోక్‌సభలో అడుగు పడలేదు. అయితే, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కేంద్రం తీసుకున్న చొరవతో, రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ లభించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇది కేవలం ఒక పార్టీ సాధించిన విజయం కాదు. దేశంలోని సగం జనాభా ఆకాంక్షలకు దక్కిన రాజ్యాంగ గౌరవం.

ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాలలో మహిళా సభ్యుల సంఖ్య కేవలం ఎనభై రెండు (సుమారు 15 శాతం) మాత్రమే ఉంది. 33 శాతం రిజర్వేషన్ అమలులోకి వస్తే, ఈ సంఖ్య కనీసం 181కి చేరుతుంది. అయితే, ఈ మార్పును తేవడంలో ఎదురయ్యే అతిపెద్ద సాంకేతిక సమస్య ఏమిటంటే, ప్రస్తుతం ఉన్న స్థానాలను అలాగే ఉంచి రిజర్వేషన్లు అమలు చేస్తే, అనేకమంది సీనియర్ నాయకులు తమ నియోజకవర్గాలను వదులు కోవాల్సి వస్తుంది. ఇది రాజకీయంగా తీవ్రమైన అశాంతికి దారితీస్తుందని గ్రహించిన కేంద్రం.. ఒక మేధోపరమైన ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేసింది. అదే లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడం. లోక్‌సభ సీట్ల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుండి 850 వరకు పెంచే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. ఈ విధానం ద్వారా రాష్ట్రాలకు సుమారు 815 స్థానాలను, కేంద్ర పాలిత ప్రాంతాలకు 35 స్థానాలను కేటాయించవచ్చు. ఇలా సీట్ల సంఖ్యను పెంచడం వల్ల, ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులకు భంగం కలగకుండానే, అదనంగా ఏర్పడే స్థానాల్లో మహిళలకు 33 శాతం వాటాను సులభంగా భర్తీ చేయవచ్చు.

ఈ సీట్ల పెంపు ప్రక్రియ 'నియోజకవర్గాల పునర్విభజన' మరియు జనాభా గణనతో ముడిపడి ఉంది. రాబోయే జనగణన తర్వాతే ఈ మార్పులు అమలులోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ఇది భారత ఫెడరల్ వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.

ముఖ్యంగా జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు మరియు కేరళ వంటి రాష్ట్రాలు, సీట్ల పెంపులో తమ ప్రాతినిధ్యం తగ్గకుండా చూడాలని కోరుతున్నాయి. జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు దక్కితే, అది పార్లమెంటరీ సమతుల్యతను దెబ్బతీస్తుందనే వాదన ఉంది. అందువల్ల, మహిళా రిజర్వేషన్లు అమలు చేసే క్రమంలో ప్రాంతీయ సమానత్వాన్ని కాపాడటం కేంద్రం ముందున్న ప్రధాన సవాలు. ఈ సమస్యను పరిష్కరించడానికి తగిన శాస్త్రీయ విధానాన్ని అవలంబించినప్పుడే ఈ సంస్కరణ పూర్తిస్థాయిలో విజయవంత మవుతుంది.

సామాజిక కోణంలో చూస్తే, మహిళా రిజర్వేషన్లు సమాజంలో సానుకూల మార్పులను తీసుకువస్తాయి. 73,74 రాజ్యాంగ సవరణల ద్వారా గ్రామ పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో మహిళలకు కల్పించిన రిజర్వేషన్లు ఇప్పటికే అద్భుతమైన ఫలితాలను ఇచ్చాయి. అక్కడ మహిళలు కేవలం 'రబ్బరు స్టాంపులు'గా మిగిలిపోకుండా, స్వంత నిర్ణయాలతో గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. జాతీయ స్థాయిలో కూడా మహిళల భాగస్వామ్యం పెరిగితే, దేశ బడ్జెట్ కేటాయింపుల్లో లింగ సమానత్వం ప్రతిబింబిస్తుంది. ఆరోగ్యం, విద్య, పోషణ, తాగునీరు, మహిళా భద్రత వంటి అంశాలకు చట్టసభల్లో మునుపెన్నడూ లేని ప్రాధాన్యత లభిస్తుంది. స్త్రీల దృక్కోణం నుండి చట్టాలు రూపొందించ బడినప్పుడు, అవి మరింత మానవీయంగా మరియు సమగ్రంగా ఉండే అవకాశం ఉంటుంది.

అయితే, ఈ బిల్లు అమలులో 'ప్రాక్సీ పాలిటిక్స్' లేదా 'ముసుగు రాజకీయాలు' అనే ప్రమాదాన్ని విస్మరించలేం. మహిళల పేరుతో ఎన్నికల్లో గెలిచి, తెర వెనుక పురుషులు అధికారాన్ని చెలాయించే ధోరణిని అరికట్టాల్సిన అవసరం ఉంది. రాజకీయ పార్టీలు మహిళలకు కనీస శిక్షణ ఇవ్వాలి, నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించాలి. అంతేకాకుండా, ఓబీసీ మహిళలకు అంతర్గత రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ సామాజిక న్యాయం దృష్ట్యా చర్చించ దగినది. సమాజంలోని అన్ని వర్గాల మహిళలకు ప్రాతినిధ్యం దక్కినప్పుడే ప్రజాస్వామ్యం పరిపూర్ణ మవుతుంది. రొటేషన్ పద్ధతిలో నియోజకవర్గాల కేటాయింపు వల్ల మహిళా నాయకురాళ్లు తమ క్షేత్రస్థాయి బలాన్ని పెంచుకోవడానికి వీలు కలుగుతుంది. ఇది రాజకీయ రంగంలో నవ నాయకత్వం పుట్టుకు రావడానికి దారితీస్తుంది.

రాజకీయ పరంగా చూస్తే, ఈ బిల్లు పార్టీల అంతర్గత నిర్మాణాలను కూడా ప్రభావితం చేస్తుంది. పార్టీ టిక్కెట్ల పంపిణీలో మహిళలకు ప్రాధాన్యత పెరగడం వల్ల, కుటుంబ రాజకీయాలకు స్వస్తి పలికి ప్రతిభావంతులైన మహిళలు ముందుకు రావడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఇది భారత ప్రజాస్వామ్య నాణ్యతను ప్రపంచ వేదికపై ఉన్నత స్థానంలో నిలబెడుతుంది. ఐక్యరాజ్య సమితి సూచించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో లింగ సమానత్వం ఒక ప్రధానాంశం. భారతదేశం ఈ బిల్లు ద్వారా ఆ లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు అనేది కేవలం ఒక రాజకీయ ప్రక్రియ కాదు. అది ఒక సామాజిక విప్లవం. 33 శాతం రిజర్వేషన్, లోక్‌సభ స్థానాల భారీ పెంపు, రాష్ట్రాలకు 815 సీట్ల కేటాయింపు వంటి అంశాలు కలిసి భారత పార్లమెంటరీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయి. ఈ మార్పు విజయవంతం కావాలంటే కేవలం ప్రభుత్వం మాత్రమే కాదు, సమాజం కూడా తన దృక్పథాన్ని మార్చుకోవాలి.

మహిళలను కేవలం ఓటర్లుగా కాకుండా, దేశ గమనాన్ని నిర్దేశించే పాలకులుగా గుర్తించాలి. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ లభించి, ఈ బిల్లు చట్టరూపం దాల్చిన రోజు, భారత ప్రజాస్వామ్య చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ బడుతుంది.నవభారత నిర్మాణంలో నారీ శక్తి తన సముచిత స్థానాన్ని ఆక్రమించుకోవడం ద్వారానే దేశం సమగ్ర అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. ఇది కేవలం స్త్రీలకు లభించిన అవకాశం కాదు, దేశ భవిష్యత్తుకు లభించిన ఒక చారిత్రాత్మక రక్షణ కవచం.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# సంఘ సంస్కర్త కందుకూరి



తరతరాలుగా భారతీయ సమాజంలో అనేక ఆచారాలకు ఎలాంటి ప్రామాణిక ఆధారాలు లేకపోయినా అత్యధికులు ప్రగాఢంగా విశ్వసించి, తార్కికదృష్టి లేకుండా అనుసరిస్తూండేవారు. 20వ శతాబ్దం ప్రారంభం నాటికి సమాజంలో దురాచారాలు బలంగా నాటుకు పోయాయి.

సంఘ సంస్కరణ అంటే మార్పు కోరుతూ వేదికలపై అనర్గళంగా చేసే ఉపన్యాసం కాదు. సమాజమంతా సదాచారమని విశ్వసించి, ఆచరిస్తున్న ఒక సామాజిక దురాచారాన్ని 'మీరు చేస్తున్నది తప్పు. ఇది అమానుషత్వం. ఆచరిస్తున్న దురాచారాలను ఎత్తి చూపి, ప్రజల మధ్యకు చొచ్చుకు పోగలిగే వాడే అసలైన సంస్కరణవాది. తానుంటున్న సమాజాన్ని ఒప్పించి, మెప్పించి దురాచారాలను మాన్పించగలిగిన వాడే నిజమైన వీరుడు, సంస్కర్త. ఆ కోవకు చెందిన వారే కందుకూరి వీరేశలింగం.



వీరేశలింగం స్త్రీవిద్యకై ఉద్యమించి,ప్రచారం చెయ్యడమే కాక, బాలికల కొరకు పాఠశాలను ప్రారంభించాడు. మగపిల్లలతో ఆడపిల్లలు కలిసి చదువుకునే సహ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాడు కూడా. అంటరాని కులాలకు చెందిన పిల్లలను కూడా చేర్చుకుని మిగతా పిల్లలతో కలిపి కూర్చోబెట్టేవాడు. వారికి చదువు చెప్పడంతో పాటు పుస్తకాలు, పలకా బలపాలు కొనిచ్చేవాడు. అనాటి సమాజంలో ఆడపిల్లలకు బాల్యంలోనే పెళ్ళిళ్ళు చేసే వారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనేవారు. దీనిని రూపుమాపేందుకు పునర్వివాహాలు జరిపించాలని ప్రచారం చేయటమే కాకుండా ఎన్ని కష్టాలెదురైన ఆచరణలో పెట్టాడు.

వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 న రాజమండ్రిలో పున్నమ్మ,సుబ్బారాయుడు దంపతులకు జన్మించారు. వీరి పూర్వీకులు ఇప్పటి ప్రకాశం జిల్లాలోని కందుకూరు నుండి రాజమండ్రికి వలస వెళ్ళడం వలన వారికి ఈ ఇంటి పేరు స్థిరపడిపోయింది.

వీరేశలింగానికి నాలుగేళ్ళ వయసులో తండ్రి చనిపోయాడు. పెదతండ్రి, నాయనమ్మల పెంపకంలో అల్లారు ముద్దుగా పెరిగాడు. ఐదో యేట బడిలో చేరి, బాలరామాయణం, ఆంధ్రనామ సంగ్రహం, అమరం, రుక్మిణీ కళ్యాణం, సుమతీశతకం, కృష్ణ శతకం మొదలైనవి నేర్చుకున్నాడు. పన్నెండో యేట రాజమండ్రి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు చదువులో చేరాడు. ఆయన పదమూడో యేట బాపమ్మ (కందుకూరి రాజ్యలక్ష్మమ్మ) అనే ఎనిమిదేళ్ళ అమ్మాయితో బాల్యవివాహమయింది. పెరిగి పెద్దయ్యాక వీరేశలింగం ఇటువంటి దురాచారాల నిర్మూలనకే కృషి చేసాడు.

చదువుకునే రోజుల్లో కేశవ్ చంద్ర సేన్ రాసిన పుస్తకాలు చదివి ప్రభావితుడయ్యాడు. విగ్రహారాధన, పూజలు మొదలైన వాటి మీద నమ్మకం తగ్గడమే కాక,దయ్యాలు, భూతాలు లేవనే అభిప్రాయానికి వచ్చాడు. ప్రజలకు అది నిరూపించడానికి అర్ధరాత్రి శ్మశానానికి వెళ్ళేవాడు.

1867లో పెదనాన్న మరణంతో ప్రభుత్వోద్యోగంలో చేరాలని ప్రయత్నించాడు, కాని లంచం ఇవ్వనిదే రాదని తెలిసి, ప్రభుత్వోద్యోగం చెయ్యకూడదని నిశ్చయించుకున్నాడు. న్యాయవాద పరీక్ష వ్రాసి, న్యాయవాద వృత్తి చేపడదామని భావించినా, అందులోనూ అవినీతి ప్రబలంగా ఉందనీ, అబద్ధాలు ఆడటం వంటివి తప్పనిసరి అని గ్రహించి, అదీ మానుకున్నాడు. ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించాడు. ఉపాధ్యాయుడిగా పిల్లలకు పాఠాలతోపాటు, సంఘ సంస్కరణ భావాలను బోధించాడు. సమాజంలోని దురాచారాలపై తన భావాలను వ్యాప్తి చెయ్యడానికి 1874 అక్టోబరులో వివేకవర్ధని అనే పత్రికను ప్రారంభించాడు. సంఘంలోని అవకతవకలను ఎత్తి చూపడం, దురాచారాల నిర్మూలన, ప్రభుత్వ వ్యవస్థలో ప్రబలంగా ఉన్న అవినీతిని ఎత్తిచూపి, అవినీతిపరులను సంఘం ముందు పెట్టడం వివేకవర్ధని లక్ష్యాలని ఆయన మొదటి సంచికలో తెలియజేసాడు. చెప్పడమే కాదు, అలాగే నడిపాడు కూడా. వివేకవర్ధని అవినీతిపరుల పాలిట సింహస్వప్నమయింది.

వీరేశలింగం హేతువాది. ఆయన జీవితం సంఘ సంస్కరణ, సాహిత్య కృషులతో పెనవేసుకు పోయింది. ఒకదానినుండి మరో దానిని విడదీసి చూడలేము. ప్రభుత్వంలోని అవినీతిని ఏవగించుకుని ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాన్ని, అబద్ధాలు ఆడక తప్పదని న్యాయవాద వృత్తిని వదులుకున్న వ్యక్తి అటువంటి దురాచారాలపై ధ్వజమెత్తి తన సంస్కరణాభిలాషను నిరూపించుకున్నాడు.

సంఘసేవలో వీరేశలింగం ఎంత కృషి చేసాడో, సాహిత్యంలోనూ అంతే కృషి జరిపాడు. చదువుకునే రోజుల్లోనే రెండు శతకాలు రాసాడు. పత్రికలకు వ్యాసాలు రాస్తూ ఉండేవాడు. వివేకవర్ధనిలో సులభశైలిలో రచనలు చేసేవాడు. వ్యావహారిక భాషలో రచనలు చేసిన ప్రథమ రచయితలలో ఆయన ఒకడు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో ప్రతిభ కలవాడు కందుకూరి.

ఆయన 130 కి పైగా గ్రంథాలు రాశాడు. అన్ని గ్రంథాలు రాసిన వారు తెలుగులో అరుదు. రాజశేఖర చరిత్ర అనే నవల,సత్యరాజా పూర్వ దేశయాత్రలు ఆయన రచనలలో ప్రముఖమైనవి. అనేక ఇంగ్లీషు, సంస్కృత గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు. బడి పిల్లల కొరకు వాచకాలు రాశాడు. స్వీయ చరిత్ర రాశాడు. ఆంధ్ర కవుల చరిత్రను కూడా ప్రచురించాడు. సంగ్రహ వ్యాకరణం రాశాడు. నీతిచంద్రిక (తెలుగు పంచతంత్రం) లోని సంధి, విగ్రహం భాగాలను చిన్నయసూరి వదిలి వేయగా వీరేశలింగం పూర్తి చేసాడు.

కందుకూరి వీరేశలింగం మహాకవి కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలం నాటకాన్ని తెలుగులో అనువదించారు. ఆయన రాసిన ఆంధ్ర కవుల చరిత్ర, స్వీయ చరిత్ర బహుళ ప్రచారం పొందాయి. హిత కారిణి సమాజం ద్వారా ఎన్నో నాటకాలను రాసి ప్రదర్శించారు. ఆధునికాంధ్ర యుగకర్తగా ప్రసిద్దులైన వీరేశలింగం 1919 సంవత్సరం మే 27వ తేదీన మద్రాసులో పరమపదించారు.

ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటక కర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007 నుంచి తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

''తన దేహము తన గేహముతన కాలము/ తన ధనంబు తన విద్య జగజ్జనులకే /వినియోగించిన ఘనుడీ వీరేశలింగ కవి జనులార'' అని ఆయన గురించి చిలకమర్తి లక్ష్మీనరసింహం చెప్పిన పద్యం ఆయన సమాధి మీద ఈనాటికీ నిలిచి ఉంది.

జీవితాంతం సమాజ సేవకే అంకితమైన కందుకూరి వారి ఆశయసాధనకు మనమంతా కృషి చేయడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.

**(ఏప్రిల్ 16 కందుకూరి వీరేశలింగం జయంతి)**

**- సుధాకర్.ఏ.వి**
9000674747

# ఆమెకు పవర్ కూడా..

భారత ప్రజాస్వామ్య చరిత్రలో మహిళా ప్రాతినిధ్యం అనేది దశాబ్దాలుగా అపరిష్కృతంగా మిగిలిపోయిన ఒక కల. ఆ కలను సాకారం చేసే దిశగా కేంద్రం అడుగులు వేస్తూ, 'నారీ శక్తి వందన్ అధినియం'(మహిళా రిజర్వేషన్ బిల్లు)ను ఈ శతాబ్దపు అత్యంత కీలక సంస్కరణగా అభివర్ణించింది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం స్థానాలను కేటాయించాలనే ఈ నిర్ణయం, దేశ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేయగల శక్తిని కలిగి ఉంది. సాధారణంగా ఏదైనా రిజర్వేషన్ అమలు కావాలంటే జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన ప్రాతిపదికగా ఉండాలి. తాజా జనాభా లెక్కల ప్రక్రియ ఆలస్యం కావడంతో, ప్రభుత్వం గత గణాంకాల ఆధారంగానే ముందుకు వెళ్లాలని భావిస్తోంది. దీనిపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. నియోజకవర్గాల పునర్విభజన జరగకుండా రిజర్వేషన్లు అమలు చేస్తే, అది కొన్ని



రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని దెబ్బతీస్తుందని, రాజకీయ సమతుల్యత తప్పుతుందని విపక్షాలు వాదిస్తున్నాయి. అయితే, డీలిమిటేషన్ కమిషన్ నివేదిక కోసం వేచి చూస్తే 2029 ఎన్నికల వరకు ఈ ప్రక్రియ పూర్తికాదని ప్రభుత్వం వాదన. మహిళలకు దక్కాల్సిన న్యాయం మళ్లీ వాయిదా పడకూడదన్న ఉద్దేశంతోనే ఈ తక్షణ చర్యలు అవసరమని అధికార పక్షం సమర్థించుకుంటోంది.

మహిళలు నేడు దేశంలో అత్యంత ప్రభావవంతమైన ఓటు బ్యాంకుగా ఆవిర్భవించారు. ఈ నేపథ్యంలో, వారి మద్దతు కూడగట్టేందుకే ప్రభుత్వం ఈ బిల్లును హడావుడిగా ముందుకు తెచ్చిందన్నది ప్రతిపక్షాల ప్రధాన ఆరోపణ. విమర్శలు కేవలం చట్టంపై కాదు అమలు విధానంపైనే.. కేవలం పదవులిస్తేనే సరిపోదు.. పవర్ కూడా ఉండాలి.. చట్టసభల్లో సీట్లు పెరిగినంత మాత్రాన మహిళల సామాజిక స్థితిగతులు రాత్రికి రాత్రే మారిపోవు. రాజకీయాల్లో మహిళల ప్రవేశం కేవలం నామమాత్రపు పదవులకే పరిమితం కాకూడదు. వారికి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అధికారం, భద్రత, సామాజిక గౌరవం దక్కినప్పుడే ఈ చట్టానికి పరిపూర్ణత లభిస్తుంది. నారీ శక్తి వందన్ చట్టం కేవలం ఒక చట్టబద్ధమైన పత్రం కాకూడదు. రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా, అన్ని పార్టీలు ఏకతాటిపైకి వచ్చి ఈ సంస్కరణను సమర్థవంతంగా అమలు చేసినప్పుడే భారత ప్రజాస్వామ్యం మరింత పరిపుష్టం అవుతుంది. విమర్శలు విజ్ఞతతో ఉండాలి.. విమర్శలు విజ్ఞతతో స్వీకరించాలి. అప్పుడే ముందడుగు లక్ష్యం నెరవేరుతుంది.

**- పసుపులేటి వెంకటేశ్వరరావు**
8885797981

# మొదటి అంతరిక్ష యాత్రికుడు యూరీ గగారిన్



1961లో యూరీ గగారిన్ చేపట్టిన తొలి మానవ సహిత అంతరిక్ష విమాన యాత్రను ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాన దినోత్సవంగా 2011 నుంచి నిర్వహిస్తున్నారు. అంతరిక్ష సాంకేతికత, శాస్త్రీయ ప్రగతి, అంతరిక్ష యాత్రల్లో ఎదురవుతున్న సవాళ్లు, అంతరిక్ష యాత్రల్లో మానవులను వివిధ గ్రహాలు, ఉప గ్రహాలకు పంపించి పరిశోధనలు జరపడం, మానవాళి అంతరిక్ష రహస్యాల శోధనలు, గత కొన్ని దశాబ్దాలుగా వాయువేగంతో కొనసాగుతున్నది. మానవ సహిత అంతరిక్ష యాత్రల ద్వారా మానవాళి శ్రేయస్సు, సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడం జరుగుతున్నది.

సోవియట్ యూనియన్ వ్యోమగామి యూరీ గగారిన్ 'వేస్టోక్ 1' అంతరిక్ష నౌకలో భూమి చుట్టూ ప్రదక్షిణ చేసిన తొలి వ్యక్తిగా అంతరిక్ష చరిత్రను సృష్టించారు. ఈ చారిత్రాత్మక యాత్ర యావత్ మానవాళి ప్రయోజనం కోసం అంతరిక్ష పరిశోధనకు మార్గం సుగమం చేసింది. శాంతి యుత ప్రయోజనాలు, అంతరిక్ష అన్వేషణలతో పొందిన ప్రయోజనాలను ప్రపంచ మానవాళికి విస్తరించడానికి ఈ వేదికలు ఉపయుక్తం అవుతున్నాయి. 1957 అక్టోబర్4న మానవుడు తయారు చేసిన భూమి ఉపగ్రహం స్పుత్నిక్-1 అంతరిక్షంలోకి ప్రయోగించబడింది. ఆ తర్వాత 12 ఏప్రిల్ 1961న యూరిగగారిన్ మొదటిసారి భూమి చుట్టు పరిభ్రమించిన వ్యక్తిగా అంతరిక్ష చరిత్రలో నిలిచిపోయాడు. ఆ తర్వాత 16 జూన్ 1963న వాలెంటీనా టెరెస్కోవా భూమి చుట్టు పరిభ్రమించిన తొలి మహిళా వ్యోమగామిగా నిలిచింది. అదే క్రమంలో 20 జూలై 1969 రోజున నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుని ఉపరితలంపై అడుగు పెట్టిన తొలి వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. 1975 జూలై 17 రోజున అపోలో, సోయుజ్ అంతరిక్ష నౌకలు అనుసంధానం కావడం, ఇది అంతరిక్షంలో మొట్టమొదటి అంతర్జాతీయ మానవ సహిత యాత్ర కావడం లాంటి అద్వితీయ విజయాలను మననం చేసుకోవడానికి ఒక ఉత్తమ వేదికగా నిలుస్తున్నది.

అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాన దినోత్సవం వేదికగా అంతరిక్ష సంబంధ ఫోటో ప్రదర్శనలు, అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞాన పరిచయాలు, అంతరిక్ష ప్రయోజనాలను అవగాహన పర్చడం, యువతను అంతరిక్ష శాస్త్రసాంకేతిక రంగాల వైపు ఆకర్షించడం, అంతరిక్ష అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించడం, స్మారక తపాళా బిళ్లలను విడుదల చేయడం లాంటి కార్యక్రమాలు జరుపవచ్చు.

బాహ్య అంతరిక్ష అన్వేషణ భూమికి సమాచార ప్రసారం, దిశానిర్దేశం, వాతావరణ సూచన వంటి రంగాలపై ప్రభావం చూపే అనేక ప్రయోజనాలను తెచ్చిపెట్టింది. ఈ నిరంతర పరిశోధనలతో భూమికి సమీపంగా రాగల గ్రహశకలాల



ప్రమాదాలను ముందస్తుగా గుర్తించడం సులభం అవుతున్నది. 2011లో ఐరాస ప్రకటించిన ఈ దినోత్సవం మానవుడు బాహ్య అంతరిక్షంలోకి వేసిన తొలి యాత్ర వార్షికోత్సవాన్ని సూచిస్తున్నది.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# మారుతున్న నేరాలకు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

- **విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్**



**విజయనగరం, మనంన్యూస్ః** విజయనగరం జిల్లాలో వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న పోలీసు అధికారులతో ఏప్రిల్ 15న జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశాన్ని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ నిర్వహించి, దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎన్.డి.పి.ఎస్., పోక్సో, అట్రాసిటీ, మిస్సింగు, రోడ్డు ప్రమాద కేసులను, సోషల్ మీడియా కేసులను, హిస్టరీ షీట్లును సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - మారుతున్న కాలంతోపాటు నేరస్థులు కొత్త పంథాలను ఎంచుకోవడంతో క్రొత్త తరహా నేరాలు నమోదవుతున్నాయన్నారు. అధికారులు వాటిని ఛాలెంజ్ గా స్వీకరించి, ఆయా కేసుల మిస్టరీని ఛేధించేందుకు అధికారులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని, సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. సోషల్ మీడియా వేదికగా ధూషణలకు పాల్పడుతూ, వ్యక్తిత్వ హననంకు పాల్పడడం, సోషల్ మీడియాను దుర్వినియోగం చేయడంను తీవ్రంగా పరిగణించాలన్నారు. అటువంటి వ్యక్తులను గుర్తించి, కేసులు నమోదు చేయాలని, సాంకేతికతను వినియోగిస్తూ దర్యాప్తు చేపట్టి, నిందితులు శిక్షించబడే విధంగా సాక్ష్యాలను, సాంకేతిక ఆధారాలను సేకరించి, బాధ్యులైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి నియంత్రణ, మహిళల భద్రత, సైబరు నేరాల నియంత్రణకు ప్రాధాన్యత కల్పించాలని, నేరాలకు పాల్పడే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తూనే, నేరాలకు పాల్పడడం వలన కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కొద్ది రోజుల్లో రానున్నందున అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, క్షేత్ర స్థాయిలో నిఘా వ్యవస్థను ఏర్పరుచుకోవాలని, గ్రామ సందర్శనలు తరుచూ చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు గంజాయి, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్ధాలను వివరించాలని, మహిళలు, బాలలు, రహదారి, సైబరు భద్రత గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీసు సేవలను వారికి చేరువ చేయాలని, జవాబుదారి తనంతో పని చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమాచార సేకరణకు, ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాల్లో మహిళా సంరక్షణ పోలీసుల (ఎం.ఎస్.పి) సేవలను వినియోగించుకోవాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. నేరాలు జరగకుండా రాత్రి గస్తీని, పెట్రోలింగును ముమ్మరం చేయాలని, నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దర్యాప్తు చేపట్టే అన్ని కేసుల్లోను ఈ-సాక్ష్య యాప్ ను వినియోగించాలని, ఫోటోలను, వీడియోలను ఈ-సాక్ష్యలో నిక్షిప్తం చేయాలన్నారు. కొత్త క్రిమినల్ చట్టాలకు అనుగుణంగా గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో అభియోగ పత్రాలను నిర్దిష్ట సమయంలోగా ఆయా న్యాయస్థానాల్లో దాఖలు చేయాలన్నారు. మైనరు డ్రైవింగు, హెల్మెట్ ధారణ, డ్రంకన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగుపై ప్రత్యేక దృష్టి పెట్టి, కేసులు నమోదు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. నేరాలను నియంత్రించుటలో హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులు, పాత నేరస్థుల కదలికలపై పెట్టే నిఘా పెట్టాలన్నారు. వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదై, దర్యాప్తులో ఉన్న కేసులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా సమీక్షించి, ఆయా కేసుల్లో పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొన్నారు. గ్రామ స్థాయిలో గంజాయి సేవించే వారిని గుర్తించి, వారికి గంజాయిని విక్రయించే వారి వివరాలు రాబట్టి, వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు.

వివిధ పోలీసు స్టేషన్లలో నమోదై, దర్యాప్తులో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులు, పోక్సో కేసులు, ఎన్డీపిఎస్, మిస్సింగు, మహిళలపై జరుగుతున్న దాడుల కేసులను, గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎన్ఫోర్సుమెంటు కేసులను జిల్లా ఎస్పీ సమీక్షించి, దర్యాప్తు పెండింగులో ఉండుటకుగల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, దర్యాప్తు పూర్తి చేయుటకు అధికారులకు జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేసారు. మిస్సింగు వ్యక్తులను ట్రేస్ చేయుటకు, నాన్ బెయిలబుల్ వారంట్లను ఎగ్జిక్యూట్ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిఎస్పీలు ఆర్.గోవిందరావు, ఎస్.రాఘవులు, ఎం.వీరకుమార్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, పలువురు సీఐలు, వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చందనోత్సవ విజయవంతానికి అంకితభావంతో పనిచేయాలి

## తుది విడత సమీక్షలో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

## సెక్టార్ అధికారులు సమన్వయంతో.. సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచన

## ప్రయివేటు వాహనాలను అనుమతించం.. ఒక పాస్ పై ఒక వాహనాన్నే అనుమతిస్తాం: సీపీ

**విశాఖపట్నం, ఏప్రిల్ 15ః** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక చందనోత్సవ వేడుకను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన తుది విడత సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులు చేపట్టిన ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించి తగిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఉత్సవ ప్రాంతాన్ని మొత్తం 12 సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్కు దేవస్థానం, రెవెన్యూ, పోలీస్ శాఖల నుంచి ముగ్గురు సీనియర్ అధికారులను ఇన్చార్జుగా నియమించినట్లు తెలిపారు. వీరు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ సమన్వయంతో పని చేసి, తక్షణ నిర్ణయాలు తీసుకుంటూ పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్ల నిర్వహణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. కొండ దిగువన ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాల వద్ద ప్రత్యేక అధికారులను నియమించి భక్తుల రాకపోకలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే హోల్డింగ్ ఏరియాలను వినియోగించాలని సూచించారు. ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరించాలని ఆదేశించారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా వంటి ప్రాథమిక సౌకర్యాలను పకడ్బందీగా కల్పించాలని ఆదేశించారు. డ్యూటీలో ఉన్న అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో అందుబాటులో ఉండాలని, కమ్యూనికేషన్ లోపాలు తలెత్తిన పక్షంలో ప్రత్యక్షంగా సమన్వయం చేసుకునే విధంగా సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో సెక్టార్ అధికారులుగా పనిచేసిన అనుభవాన్ని ఈ ఉత్సవాల్లో వినియోగించాలని కోరారు. చందనోత్సవం రోజున సుమారు 2 లక్షల మంది భక్తులు విచ్చేసే అవకాశమున్నందున, ప్రతి భక్తుడు ప్రశాంతంగా స్వామివారి దర్శనం పొందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, దేవస్థానం అధికారులు బృంద స్ఫూర్తితో పని చేయాలని సూచించారు.

**ఒక పాస్ పై.. ఒక వాహనమే అనుమతి : సీపీ**

ఒక పాస్ పై ఒక వాహనాన్నే అనుమతించేలా నిబంధనలు అమలు చేస్తామని, దీనికి అందరూ సహకరించాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు. వి.ఐ.పి.ల జాబితాను ముందుగానే సిద్ధం చేసి వారికి నిబంధనలను స్పష్టంగా తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దర్శనానికి ఒక్క వి.ఐ.పి.తో పాటు గరిష్టంగా ఆరుగురు సభ్యులకు మాత్రమే అనుమతి ఉంటుందని, దీనికి మించి అనుమతించబోమని స్పష్టం చేశారు. పాస్ ఉన్న వాహనానికి మించి ఎవరైనా వస్తే దేవదాయ శాఖ ప్రత్యేక వాహనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయివేటు వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుని, స్పష్టమైన కమ్యూనికేషన్ ద్వారా నియంత్రణ చర్యలు అమలు చేయాలన్నారు. నిబంధనల అమలులో పోలీస్ యంత్రాంగం, దేవదాయ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో సమన్వయం వహించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, డీఆర్వో ఎం. విశ్వేశ్వర నాయుడు, దేవస్థానం ఈవో జె. వెంకటరావు, ఆర్డీవోలు సంగీత్ మాధుర్, శేషశైలజ, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన ఎస్పీ మాధవ్ రెడ్డి

**పార్వతీపురం ఏప్రిల్ 15 మనం న్యూస్ః** పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తూ ఇటీవల కాలంలో ప్రమాదవసాత్తు జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన కీ.శే.లు గవర మల్లేశ్వరరావు, పిసి 1361/367 సతీమణి డొల్లు శ్రావణి కి కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులను జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి చేతులమీదుగా జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వహించే సిబ్బంది ప్రజల భద్రత కోసం తమ జీవితాలను పణంగా పెట్టి పనిచేస్తుంటారు. అటువంటి సిబ్బంది అకాల మరణం కుటుంబాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేస్తుంది. మరణించిన పోలీస్ సిబ్బంది కుటుంబాలు ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక సమస్యలను, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారి కుటుంబంలోని అర్హత కలిగిన వ్యక్తులలో ఒకరికి ప్రభుత్వం కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తూ ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేసామన్నారు. ఇటీవల కాలంలో ప్రమాదవసాత్తు జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన కీ.శే.లు గవర మల్లేశ్వరరావు, పిసి



1361/367 సతీమణి డొల్లు శ్రావణి కి కారుణ్య నియామకం కింద చినమేరంగి, ప్రభుత్వ పోలిటెక్నికల్ కళాశాలలో జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ (టైపిస్ట్) గా నూతనంగా ఉద్యోగం మంజూరు చేయగా, జిల్లా ఎస్పీ నియామక ఉత్తర్వులు అందజేసి అభినందించారు. విధుల్లో తక్షణమే జాయిన్ అవ్వాలని,నిర్వర్తించాల్సిన విధుల గురించి తెలుసుకోవాలని, తమకు లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ సూచించారు. పోలీస్ శాఖాపరంగా రావాల్సిన ప్రయోజనాలు అందాయ,లేదా అని ఆరాతీసి, రావాల్సిన ప్రయోజనాలు ఏమైనా వుంటే త్వరగా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఏఆర్ ఆర్ఐ లు నాగేశ్వరరావు, నాయుడు,రాంబాబు పాల్గొన్నారు.

# ఫ్లిప్కార్ట్తో మహిళా విష్ మాస్టర్లు భాగం

**విజయవాడ, మనంన్యూస్ః** భారతదేశవ్యాప్తంగా, ఫ్లిప్కార్ట్ వంటి ప్లాట్ఫారమ్ల నేతృత్వంలో ఈ-కామర్స్ పెరుగుదల కేవలం వినియోగాన్ని పెంచడమే కాకుండా, మార్కెట్ప్లేస్ ఆవిష్కరణలు మరియు విస్తృతశ్రేణి సరఫరా చైన్ పరిధి ద్వారా లెక్కలేనంత మంది విక్రయదారులకు జాతీయ మార్కెట్లను చేరుకోవడానికి వీలు కల్పించింది. ఇది ముఖ్యంగా సాంప్రదాయకంగా మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉన్న రంగాలలో కొత్త ఉపాధి మార్గాలను తెరిచింది. ఉదాహరణకు, ఫ్లిప్కార్ట్ లాజిస్టిక్స్ మరియు లాస్ట్ మైల్ డెలివరీలో ఇప్పుడు మహిళలు ఆత్మవిశ్వాసంతో, ఒక లక్ష్యంతో అడుగుపెట్టడాన్ని ఎక్కువగా చూస్తున్నాము. ఫ్లిప్కార్ట్ వద్ద, మహిళలు విష్మాస్టర్ నెట్వర్క్లో ఒక ముఖ్యమైన భాగంగా ఉన్నారు. ప్రతిరోజూ లక్షలాది ప్యాకేజీలు ఫ్లిప్కార్ట్ కస్టమర్లకు చేరేలా వీరు చూసుకుంటున్నారు. ఇది మా కార్యాచరణ లోతు, స్థిరత్వం మరియు దీర్ఘకాలిక సామర్థ్యానికి నిదర్శనం. ప్రతి డెలివరీ వెనుక స్థిరత్వం, ఆశయం మరియు మెరుగైన జీవితాన్ని నిర్మించుకోవాలనే కోరికతో కూడిన ఒక వ్యక్తిగత కథ ఉంటుంది. బిల్కిష్ అన్సారి, నాగురు మాధవి మరియు షాహిదా పి వంటి మహిళలకు, విష్మాస్టర్గా మారడం కేవలం వృత్తిపరమైన ఎదుగుదలను తీసుకురావడమే కాకుండా, ఆర్థిక స్థిరత్వం ద్వారా వారి కుటుంబాల భవిష్యత్తును కూడా మార్చివేసింది. అవకాశాల లభ్యత క్షేత్రస్థాయిలో ఎంతటి అర్థవంతమైన మార్పును తీసుకురాగలదో వారి అనుభవాలు వివరిస్తాయి.

జోధ్పూర్ కు చెందిన బిల్కిష్ అన్సారీ, తిరుపతిలో, మాధవి నాగురు కొచ్చిలో నిబద్ధతతో షాహిదా సాధించిన ప్రగతి ఇలా పలువురు మహిళలు ఫ్లిప్కార్ట్ విష్ మాస్టర్లుగా రాణిస్తున్నట్టు ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు.

# మీ..సేవల్లో... ఏసీబీ సోదాలు

## పౌరసేవల్లో అడ్డగోలు వసూళ్లు

## ఎంఆర్ఓ కార్యాలయాలతో లింకులు

**హైదరాబాద్,ఏప్రిల్ 15(మనం, ప్రత్యేక ప్రతినిధి)ః** మీ సేవా కేంద్రాలలో సర్టిఫికెట్ల జారీలో పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణల మేరకు పలు మీసేవ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఈక్రమంలో ఖైరతాబాద్, అంబర్ పేట్, అల్వాల్లో మీసేవ కేంద్రాలలో బుధవారం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇటీవల కాలంలో మీ సేవల్లో దోపిడి ఎక్కువైపోయిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

చార్జీల పేరుతో మీసేవ సిబ్బంది చేస్తోన్న దోపిడీకి అడ్డుఅదుపు లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో కుల, ఆదాయ, నివాస, బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం వెళ్తే దోచుకుంటున్నారని, ఈక్రమంలో సంబంధిత ఎంఆర్ఓ కార్యాలయాలతో సంబంధాలు పెట్టుకుని అందిన కాడికి దోచుకుంటున్నారని ఏసీబీ ప్రాథమిక విచారణలో తేలింది. కుల, ఆదాయ, నివాస, కుటుంబసభ్యుల ధ్రువీకరణ, ఓబీసీ తదితర సర్టిఫికెట్ల కోసం రూ. 45 ఫీజు వసూలు చేయాల్సి ఉండగా సదరు మీ సేవాల కేంద్రాల నిర్వహకులు రూ.500 నుంచి రూ.1000 వరకు తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరు అప్లై చేసేప్పుడు కాకుండా తిరిగి సర్టిఫికెట్లు ప్రింట్ తీసుకునే టైంలో అదనంగా కలెక్ట్ చేస్తున్నారని దరఖాస్తుదారులు ఏసీబీ అధికారులకు వివరించారు.

**దళారుల దందా ః**

కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వం నిర్ణయించిన రుసుము కంటే ఎక్కువ మొత్తాన్ని మీ సేవా కేంద్రాలు వసూలు చేస్తున్నట్లు ఏసీబీ దృష్టికి వచ్చింది. ముఖ్యంగా క్యాస్ట్, లోకల్, ఇన్కం సర్టిఫికెట్లు కావాలంటే సెల్ఫ్ డిక్లరేషన్ కోసం అఫిడవిట్ సమర్పించాలనే నిబంధనలను అడ్డంగా పెట్టుకుని అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులందాయి. దీంతో ఇకపై మీ సేవ కేంద్రాల్లో తప్పనిసరిగా సర్వీసులకు సంబంధించిన ధరల పట్టిక(సిటిజన్ చార్ట్) ఏర్పాటు చేయాలని ఏసీబీ అధికారులు తేల్చిచెబుతున్నారు. మీ సేవ కేంద్రాల ముందు ఖచ్చితంగా సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయాలని, అందులో నిర్ణయించిన ధరలనే తీసుకోవాలని ఏసీబీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎక్కడైనా ఎక్కువ డబ్బులు తీసుకున్న పక్షంలో వెంటనే డయల్ 1100, 18004251110 నంబర్కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు తెలిపారు.

# పవన్ ఖేరాకు 'సుప్రీం'లో చుక్కెదరు

## తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాత్కాలిక బెయిల్పై స్టే

**హైదరాబాద్,ఏప్రిల్ 15(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః** కాంగ్రెస్ నేత పవన్ ఖేరాకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈక్రమంలో తెలంగాణ హైకోర్టు జారీ చేసిన తాత్కాలిక ముందస్తు బెయిల్పై బుధవారం సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ భార్య రిణికి భూయాన్ శర్మకు వివిధ దేశాల పాస్ పోర్టులు ఉన్నాయంటూ పవన్ ఖేరా చేసిన ఆరోపణలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన విషయం విదితమే. ఈ పిటిషన్ పై ఈనెల10న విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన.. పవన్ ఖేరాకు వారంరోజుల పాటు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేశారు. తిరిగి ఉపశమనం కోసం గువాహటి హైకోర్టును ఆశ్రయించాలని ఆదేశించారు. తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిలు మంజూరు చేయడాన్ని అసోం పోలీసులు ఈ నెల 12వ తేదీన సుప్రీంకోర్టులో సవాల్ చేసారు.

# నేటి నుంచి స్వీయ గణన ప్రారంభం

**విశాఖపట్నం, ఏప్రిల్ 15:** జనగణన-2027 ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ గణన (ఖ్చజూజ ఉుఖుళ్ళుట్బుజ్ౌ) కార్యక్రమం ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని బుధవారం ఓ ప్రకటన ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఈ వినూత్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఏప్రిల్ 16 (గురువారం) నుంచి ఏప్రిల్ 30, 2026 వరకు https://se.census.gov.in పోర్టల్ ద్వారా స్వీయ గణన చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం తరపున ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, కార్మికులు చురుకుగా పాల్గొని ఇతరులకు మార్గదర్శకులుగా నిలవాలని కోరారు. అలాగే ప్రతి స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది రోజుకు కనీసం



10 నుంచి 20 మందికి స్వీయ గణనలో సహకారం అందించాలని ఆయన ఆదేశించారు. సమాజంలోని ప్రముఖులు ముందుండి తమ వివరాలను నమోదు చేసుకుని ప్రజల్లో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. ఈ స్వీయ గణన పూర్తిగా స్వచ్ఛంద ప్రక్రియ అని, ఎవరిపైనా ఒత్తిడి చేయరాదని స్పష్టం చేశారు. దేశ భవిష్యత్తు ప్రణాళికలకు అవసరం అయ్యే కచ్చితమైన గణాంకాల కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ జాతీయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ప్రకటన ద్వారా సూచించారు.

# వికారాబాద్లో కవిత అరెస్టు

**వికారాబాద్, ఏప్రిల్ 15 :** వికారాబాద్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్టు చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపిస్తూ ఉదయం నుంచి కవిత ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో రైతుల పొట్ట కొడుతోందని ఆమె ఆరోపించారు.

భూసేకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉద్ధ ృతం చేస్తామన్నారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు.




తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీలు రైతులకు సంఘీభావం తెలిపాయి.

# మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ విశాఖ పట్నం

## కిశోరి వికాసం ప్రాంతీయ స్థాయి వర్క్షాప్ విజయవంతంగా నిర్వహణ






**విశాఖపట్నం, మనంన్యూస్ః** విశాఖపట్నం నగరంలోని పీఎపీఎ హోమ్, విశాఖపట్నం వద్ద మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'కిశోరి వికాసం' ప్రాంతీయ స్థాయి వర్క్షాప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం కిశోర బాల బాలికల సాధికారత, భద్రత, విద్యా కొనసాగింపు మరియు నాయకత్వ నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించబడింది. కార్యక్రమానికి ముందు మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి వర్చువల్ విధానంలో పాల్గొని, కిశోర బాల బాలికల సమగ్ర అభివృద్ధి కోసం అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమానికి మిషన్ వాత్సల్య సంయుక్త డైరెక్టర్ శిరీష ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి, కిశోరి వికాసం కార్యక్రమ లక్ష్యాలు, మార్గదర్శకాలు మరియు వేసవి శిబిరాల నిర్వహణ విధానంపై పాల్గొనేవారికి సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సీనియర్ కన్సల్టెంట్ నరసింహమూర్తి, యునిసెఫ్ సీనియర్ కన్సల్టెంట్ మేరీ జాన్స్, పడాల చారిటబుల్ ట్రస్ట్ సీఈఓ ప్రసాద్ పాల్గొని, కిశోరి వికాసం కార్యక్రమ అమలు విధానం, యువతలో అవగాహన పెంపు మరియు సమర్థవంతమైన కార్యాచరణపై శిక్షణ మరియు మార్గదర్శకత్వం అందించారు. ఈ ప్రాంతీయ వర్క్షాప్లో పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం మరియు అనకాపల్లి₹ జిల్లాలకు చెందిన మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా మిషన్ కోఆర్డినేటర్లు, ఆరోగ్య శాఖ నోడల్ అధికారులు, ఖిఓటమరియు ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం సుమారు 120 మంది అధికారులు మరియు ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని, కిశోరి వికాసం వేసవి శిబిరాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించారు.

# చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ నిజం కాబోతోంది

- **బీజేపీ మహిళా మోర్చా పూర్వ రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ**

**హైదరాబాద్, ఏప్రిల్ 15 :** దశాబ్దాలుగా మహిళా చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ అనేది ఒక నినాదంగా మాత్రమే ఉందని, మోడీ ఉక్కు సంకల్పంతో నిజంగా మారబోతుందని, ఆయన పేరు చిరస్థాయిగా సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని బీజేపీ మహిళా మోర్చా పూర్వ రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ పేర్కొన్నారు. దేశాన్ని పరిపాలించగల సామర్థ్యం మహిళల కు ఉందని భారత నారీమణులు ఝాన్సీ లక్ష్మీ బాయి, రాణీ రుద్రమ, అహల్యా బాయి హోల్కర్లో ఎన్నడో నిరూపించారు. మహిళా రిజర్వేషన్ ను కేవలం నినాదంగా మార్చి దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు తమ పబ్బం గడుపుకున్నాయి తప్ప మనస్ఫూర్తిగా పని చెయ్యలేదు. మహిళలు అంటే ఒకటి, రెండు కుటుంబాల మహిళలు కాదు చట్ట సభల్లో 33 శాతం ఇవ్వగలగడం అనేది ఒక అద్భుతమన్నారు. ఈ అంశంపై మూడు రోజుల పాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు పెట్టి నారీ శక్తి వందన్ అధినీయం బిల్లు అమలు చెయ్యడం గొప్ప విషయం అన్నారు. 2029 ఎన్నికల్లో మహిళకు రిజర్వేషన్ కచ్చితంగా కల్పించాలనే ధృడ సంకల్పంతో మోడీ చేస్తున్న కృషికి మహిళా లోకం హర్షిస్తుందన్నారు.

## ఆచంటలో మట్టి మాఫియా సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే



**ఆచంట ఏప్రిల్ 15 మనం న్యూస్‌:** నియోజకవర్గ కేంద్రమైన ఇటీవల ఆచంట వేమవరం పరిసర ప్రాంతాల్లో నక్కల కాలువ వెంబడి మట్టిని పలువురు తలరించారు ఇది ఇలా ఉండగా నియోజకవర్గ కేంద్రమైన కోడేరు మార్టేరు ప్రధాన రహదారిలో నక్కల కాలువ వంతనం వద్ద మట్టి మాఫియా దార్లు మరల మొదలుపెట్టారు దీంతో ఆచంట నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు చెరుకువాడ శ్రీ రంగనాథరాజు కలుగజేసుకుని మాట్లాడుతూ గోదావరి ఇసుకను మరియు రైతులకు ఉపయోగపడే మట్టిని తరలిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు అంతేకాక ఏ సంబంధిత అధికారి పర్మిషన్ లేదని అన్నారు పర్మిషన్ అధికారులు చూపించాలని అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక వైయస్సార్సీపి స్థానిక సర్పంచులు ఎంపీటీసీలు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుగా ముళ్ళపూడి



**నల్లజర్ల, ఏప్రిల్ 15 (మన ప్రతినిధి):** జాతీయ తెలుగుదేశం పార్టీలో కీలకమైన పదవిగా భావించే ఉపాధ్యక్ష పదవికి ముళ్ళపూడి బాపిరాజును నియమించడం పట్ల నల్లజర్ల నియోజకవర్గంలో ఆనందం వెల్లివిరిసింది.గతంలో జిల్లా పరిషత్ (జడ్పీ) చైర్మన్గా సమర్థవంతంగా సేవలందించిన బాపిరాజు,ప్రజల సమస్యల పరిష్కారంలో చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందారు. పార్టీ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, కృషి,ప్రజాసేవ పట్ల ఉన్న తపనను గుర్తించిన పార్టీ అధిష్టానం ఈ బాధ్యతను అప్పగించడం విశేషంగా చెప్పుకోవచ్చు.ఈ నియామకంతో నియోజకవర్గ ప్రజలు,పార్టీ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముళ్ళపూడి బాపిరాజు మాట్లాడుతూ,తనపై విశ్వాసం ఉంచి ఈ గౌరవప్రదమైన పదవిని అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని,ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి కట్టుబడి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే పార్టీని మరింత బలోపేతం చేయడం,గ్రామ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడం, యువతను ఆకర్షించడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజలకు చేరువగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే తన ముఖ్య ధ్యేయమని తెలిపారు. ఈ నియామకం ద్వారా నల్లజర్ల నియోజకవర్గానికి మరింత ప్రాధాన్యం దక్కుతుందని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు.పార్టీ శ్రేణులు బాపిరాజు నాయకత్వంలో మరింత ఉత్సాహంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు.


## నాణ్యమైన భోజనం ఇవ్వండి

- మధ్యాహ్న భోజన పథకం అమలుపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టీకరణ



**(విజయవాడ,మనం న్యూస్):** జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విజయవాడలోని ఎల్బీఎస్ నగర్లోని పుచ్చలపల్లి సుందరయ్య నగరపాలక ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించిన కలెక్టర్.. ఆహార నాణ్యత, వంటగది పరిశుభ్రత, నీటి వినియోగం, నిల్వ విధానాలపై సమగ్రంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం పోషక విలువలతో కూడి, ప్రభుత్వ నిర్దేశించిన మెనూ ప్రకారం ఉందో లేదో చూశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మమేకమైన కలెక్టర్.. వారికి రోజూ అందుతున్న భోజనం రుచి, నాణ్యతపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. కొన్ని సూచనలు స్వీకరించి, వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం విద్యార్థుల ఆరోగ్యం, హాజరు శాతం, విద్యా పురోగతిపై కీలక ప్రభావం చూపుతుందని పేర్కొన్న కలెక్టర్ లక్ష్మీశ ప్రతి పాఠశాలలో ఈ పథకం సమర్థవంతంగా అమలు కావాలని స్పష్టం చేశారు. ఏ చిన్న లోపం ఉన్నా సహించబోమని, నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.

## ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పాలకొల్లు మాంటిసోరి విద్యార్థులు



**పాలకొల్లు, ఏప్రిల్ 15,మనం ప్రతినిధిః** ఫస్టియర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో సిద్ధాని మేఘన 470 మార్కులకు 466 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించగా ఆరేపల్లి నూతన బాబు 464 మార్కులు, సాగి లక్ష్మీ హరి చందన 462, గుబ్బల నవదీపిక 460 మార్కులు సాధించగా బైపీసీ విభాగంలో గాయత్రీ లక్ష్మి 445 మార్కులు సాధించారు. సెకండ్ ఇయర్ ఫలితాల్లో బైపీసీ విభాగంలో వై ధనలక్ష్మి 988 మార్కులు, ఎన్ గీతిక 982 మార్కులు, ఎంపీసీ విభాగంలో ఎం మనోహరి 985 మార్కులు, దాసరి గణేష్ కుమార్ 984 మార్కులు, యు ప్రశాంతరాజు 982 మార్కులు, సిహెచ్ నవీజ్యోతి 982 మార్కులు, ఎల్ గీతా హారిక 982 మార్కులు, ఎన్ గాయత్రి 981 మార్క్స్, ఎన్ వెన్నెల 980 మార్క్స్ సాధించి ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు కళాశాల డైరెక్టర్ కెవి కృష్ణ వర్మ, చిలుకూరు కుమార్, అధ్యాపక అధ్యాపక ఇతర సిబ్బంది అభినందించారు.

## మట్టితో అంబేద్కర్ విగ్రహం తయారు చేసిన చిన్నారులు



**గోపాలపురం,ఏప్రిల్ 15 (మనం ప్రతినిధి):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా గోపాలపురం మండలం చిట్యాల ప్రభుత్వ హైస్కూల్కు చెందిన ఇద్దరు చిన్నారులు తమ ప్రతిభను చాటుకున్నారు.8వ తరగతి చదువుతున్న చోళ్ళ రాము,లక్ష్మణ్ లు అనే విద్యార్థులు మట్టితో అంబేద్కర్ విగ్రహాన్ని అద్భుతంగా రూపొందించి ఆ విగ్రహానికి చక్కటి రంగులు దిద్ది అందరి ప్రశంసలు అందుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి పీతల ప్రసాద్ బాబు,రిటైర్డ్ జడ్జి బొనిగే వినయ్ కుమార్,వ్యవసాయ శాఖ ఏడీ డీవీ కృష్ణ (రాజుగారు) చిన్నారుల ప్రతిభను ప్రశంసించారు.మట్టి తో అంబేద్కర్ విగ్రహాన్ని ఎంతో నైపుణ్యంతో తయారు చేసిన ఈ విద్యార్థులను అభినందిస్తూ వారికి షీల్డులు అందజేశారు.అంతే కాకుండా,రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి పీతల ప్రసాద్ బాబు ప్రత్యేకంగా నగదు బహుమతి ప్రకటించి,వారి సృజనాత్మకతను ప్రోత్సహించారు.భవిష్యత్తులో ఇంకా మంచి ప్రతిభను ప్రదర్శించాలని వారికి సూచించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ చిన్నారుల్లో ఉన్న సృజనాత్మకతను ప్రోత్సహించడం ద్వారా వారు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. గ్రామస్థులు, తల్లిదండ్రులు కూడా ఈ చిన్నారుల ప్రతిభపై హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం గ్రామ ప్రధాన కూడలిలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

## రావిపాడు పంచాయతీ పాలకవర్గానికి విశిష్ట సన్మానం



- పదవీకాలం ముగింపు సందర్భంగా పాలకవర్గానికి ప్రశంసలు అందించిన గ్రామ ప్రజలు

**పోడూరు, ఏప్రిల్ 15 మనం న్యూస్‌:** పోడూరు మండలంలోని రావిపాడు గ్రామ పంచాయతీ పాలకవర్గానికి బుధవారం ఘన సన్మానం నిర్వహించారు. సర్పంచ్ పెన్మత్స విజయలక్ష్మి మరియు పాలకవర్గం పదవీకాలం పూర్తయిన సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాభివృద్ధి కోసం కృషి చేసిన పాలకవర్గ సభ్యులను గ్రామస్థులు సత్కరించి అభినందనలు తెలిపారు. సర్పంచ్ పాలకవర్గం సభ్యులు గ్రామానికి అందించిన సేవలపై గ్రామ ప్రజలు ప్రశంసలు తెలియజేశారు.కాగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీపీ, టిడిపి సీనియర్ నాయకుడు, డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ పెన్మత్స రామభద్రరాజు మాట్లాడుతూ సర్పంచ్ మరియు వార్డు సభ్యులు గ్రామ ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి, సిబ్బందితో సోదరభావంతో కలిసి పనిచేసి గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సమగ్ర అభివృద్ధి దిశగా సేవలు అందించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పెన్మత్స రంగరాజు, రావి స్వర్ణసింగ్, అందే నాగేశ్వరరావు, కండెల్లి శ్రీనివాస్, మోక్ష గణపతి, పీతల జాన్సుందరరావు తదితరులు, గ్రామ పెద్దలు, ప్రజలు, సిబ్బంది, గ్రామ కార్యదర్శి మణికంఠ పాల్గొని పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

## భూగర్భ జలాల పెరుగుదలకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం, ఏప్రిల్ 15 (మనం న్యూస్):** జిల్లాలో భూగర్భ జలాల పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలధార పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయి ప్రసాద్ అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని తన చాంబర్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ కుమార్తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై కలెక్టర్లతో మాట్లాడారు. ప్రధానంగా, జల ధార జల హారతి కార్యాచరణ ప్రణాళిక, 22ఏ నిషేధిత భూములు, రీ సర్వే పురోగతి, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్లతో సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలని, భూగర్భ జలాల పెరుగుదలకు ఇప్పటినుంచే కార్యాచరణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైతుల పంట పొలాల నుంచి వెళ్లే మురుగునీరు వృధా కాకుండా ఉండేందుకు చిన్న డ్రైనేజీలు, ప్రధాన డ్రైనేజీలలో రీఛార్జ్ షాఫ్టులు, పర్కులేషన్ ట్యాంకులు ఏర్పాటు చేయాలన్నారు. దీనికోసం సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో ప్రాంతాలను గుర్తించాలన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా ఉన్న డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు, అవసరమైన మరమ్మతులు త్వరితగతిన పూర్తి పూర్తిచేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్లో డిఆర్ఓ కె. చంద్రశేఖర రావు, బందరు ఆర్డీవో కే సాంబశివరావు, డ్వామా పీడీ శివప్రసాద్, డ్రైనేజీ ఈఈ కిరణ్ బాబు, భూగర్భ జల శాఖ ఏడీ బిందుశ్రీ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో సత్తా చాటిన శ్రీ విశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు



**పాలకొల్లు, ఏప్రిల్ 15,మనం ప్రతినిధిః** ఈ ఏడాదిలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలలో బుధవారం విడుదలైన ఫలితాలలో పాలకొల్లు శ్రీ విశ్వ జూనియర్ కాలేజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు పాలకొల్లు పట్టణ స్థాయిలో వరుసగా ముచ్చర్ల దీపిక గౌరీ ఎం .పి .సి విభాగంలో 470 మార్కులకు గాను 467 మార్కులతో ప్రథమ స్థానంలో నిలువగా,466 మార్కులు సాధించిన వారు ముగ్గురు మరియు 465 పైన మార్కులు సాధించిన వారు 9 మంది,మరియు బై .పి .సి విభాగంలో మేడపాటి నేహా రెడ్డి 455 మార్కులకు గాను 451 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా,ఎం .ఈ .సి విభాగంలో చిత్రాడ రేణుక 500 మార్కులకు గాను 493 మార్కులతో పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచారు. అదే విధంగా ద్వితీయ సంవత్సరం ఫలితాలలో కూడా ఎం .పి .సి విభాగంలో గుండు కృష్ణ లహరి 1000 మార్కులకు గాను 991 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా,985 మార్కులు సాధించిన వారు ఎనిమిది మంది మరియు బై .పి .సి విభాగంలో సలాది పూజా కృష్ణవేణి 1000 మార్కులకు గాను 988 మార్కులతో, ఎం .ఈ .సి విభాగంలో వేరుకొండ దాత్రి శ్రీ 965 మార్కులతో పట్టణంలో ప్రథమ స్థానంలో తమ ప్రతిభను ప్రదర్శించడం పై సంస్థ యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ విశ్వ విద్యాసంస్థల చైర్మన్ కర్రి ధర్మరాజు , డైరెక్టర్ పేర్నీడి సూర్యనారాయణ , డీన్ రావిపాటి రాజాబాబు మరియు కళాశాలల ప్రిన్సిపాల్స్ గొట్టుముక్కల శ్రీనివాసరాజు ,ఏలూరి శేషగిరిరావు మరియు అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది విజేతలకు శుభాభినందనలు తెలియజేశారు.

## ప్రతీ చెరువును అధునీకరిస్తాం



- నీటి నిల్వలకు అధిక ప్రాదాన్యత
- జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ

**గుంటూరు, ఏప్రిల్ 15 : (మనం న్యూస్ ప్రతినిధి):** ‘జలధార - జలహారతి’క్రింద జిల్లాలో ఉన్న ప్రతి చెరువును గుర్తిస్తున్నామని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్ లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ నీటి బొట్టును ఒడిసి పట్టుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతీ చెరువును నీటితో నింపుటకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, ఉన్న చెరువులను గరిష్ట ప్రయోజనకారంగా మార్చుటకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జల వనరుల శాఖ,మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ మాట్లాడుతూ 2027 మార్చి నాటికి రీ సర్వే పూర్తి చేయాలన్నారు. జలధార - జలహారతి కార్యక్రమం కింద నీరు నిలువ చేసే కార్యక్రమాలను చేపట్టాలని, భూగర్భ జలాలు పెంచాలని అన్నారు. అన్నమయ్య జిల్లాలో చేపట్టిన జలవనరుల సంరక్షణ కార్యక్రమాలను సందర్శించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మి కుమారి, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, భూగర్భ జలాల శాఖ ఉప సంచాలకులు వందనం పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్లో కేజీబీవీ బాలికల ఘన విజయం

- పట్టుదలతో విజయం సాధించిన గ్రామీణ విద్యార్థినిలు
- రాష్ట్ర స్థాయి మార్కులతో మెరిసిన కేజీబీవీ బాలికలు
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 15 (మనం బ్యూరో):** నాగర్ కర్నూల్ జిల్లా విద్యా రంగంలో మరోసారి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల బాలికలు తమ ప్రతిభను చాటుకున్నారని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలోని కేజీబీవీ బాలికల జూనియర్ కళాశాలల విద్యార్థినులు అత్యుత్తమ మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచారని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ విద్యార్థినిలను బుధవారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ..., పట్టుదల, క్రమశిక్షణ, లక్ష్యసాధనపై దృష్టి పెడితే గ్రామీణ ప్రాంతాల బాలికలు కూడా అద్భుత విజయాలు సాధించగలరని, ఈ ఫలితాలు నిరూపించాయని కలెక్టర్ అన్నారు. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసిస్తూ వైద్య, ఇంజినీరింగ్, వైద్య రంగాల్లో మరింత ఉన్నత స్థానాలు సాధించాలని విద్యార్థినులకు కలెక్టర్ సూచించారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో బైపీసీ, ఎంపీసీ, ఎం.పి.హెచ్.డబ్ల్యూ విభాగాల్లో చదువుతున్న విద్యార్థినులు అత్యధిక శాతంలో ఉత్తీర్ణత సాధించడం మాత్రమే కాకుండా, రాష్ట్ర స్థాయి ర్యాంకులకు సమానంగా నిలిచే మార్కులు సాధించడం అభినందనీయం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ఈ బాలికలు అన్ని అడ్డంకులను అధిగమించి సాధించిన ఈ విజయాలు విద్యా వర్గాల్లో ప్రశంసలు పొందుతున్నారన్నారు. కష్టపడి చదవడం, గురువుల నిరంతర మార్గదర్శకత్వం, కేజీబీవీ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య ఈ ఫలితాలకు ప్రధాన కారణమన్నారు. అదేవిధంగా ఈ విజయాల వెనుక ఉన్న ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, తల్లిదండ్రుల సహకారాన్ని కూడా కలెక్టర్ ఈ సందర్భంగా ప్రశంసించారు. విద్యార్థినుల అభివృద్ధికి వారు చూపుతున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని కేజీబీవీ పాఠశాలల్లో ఇదే తరహా ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.ఈ విజయోత్సాహంలో భాగంగా విద్యార్థినిలు సంబరాలు నిర్వహించగా, విద్యార్థినులు తమ ఆనందాన్ని పంచుకున్నారు. తమ కష్టానికి ఫలితం దక్కిందని, భవిష్యత్తులో మరింత కృషి చేసి ఉన్నత లక్ష్యాలను సాధిస్తామని బాలికల ఈ సందర్భంగా తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని కేజీబీవీ బాలికల ఈ ప్రతిభ జిల్లాకు గర్వకారణంగా నిలవడంతో పాటు, ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తోందని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్, కేజీబీవీ పర్యవేక్షణా అధికారిని శోభారాణి, వివిధ కేజీబీవీల ప్రత్యేక అధికారులు, కార్యాలయ పర్యవేక్షకులు సుజాత, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నారి శక్తి బిల్లుపై బీజేపీ సానుకులం



- కాంగ్రెస్ వారసత్వ పార్టీ... బానిసల పార్టీ
- పార్లమెంటులో .. మహిళా బిల్లును పాస్ చేస్తాం
- మాజీ ఎంపీ సీతారాం నాయక్ ఇంట్లో... తేనేటి విందు హాజరైన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు
- రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన బిజెపి ప్రముఖులు

**హనుమకొండ, ఏప్రిల్ 15(మనంన్యూస్):** పార్లమెంటులో బిజెపి బిల్లును ప్రవేశపెట్టి.. నారి శక్తికి మద్దతు ప్రకటిస్తున్నామని, బిజెపి పార్టీ మహిళలపై గౌరవాన్ని చాటుకుంటుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు అన్నారు. బుధవారంబిజెపి రాష్ట్ర అధ్యక్షులు హనుమకొండలోని మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాం నాయక్ గృహం లో రాష్ట్ర అధ్యక్షులు కి తేనేటి విందును ఇచ్చారు. కిషన్ దానభంగా పలువురు బిజెపి నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, ప్రేమేందర్ రెడ్డి, రావు పద్మ రెడ్డి, కళ్యాణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుంది

- అంతునూరి శివకుమార్

**గజ్వేల్, ఏప్రిల్ 15 మనం న్యూస్‌:** ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఇంతగానో ఉపయోగపడుతుందని శ్రీ వాసవి మాత చలివేంద్రం నిర్వాహకులు ఆర్యవైశ్య నాయకులు అంతునూరి శివకుమార్ అన్నారు. స్థానిక ఇందిరాబాదు చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన శ్రీ వాసవి మాత చలివేంద్రం వద్ద బుధవారం నాడు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అంతునూరి శివకుమార్ మాట్లాడుతూ ప్రతినిత్యం గజ్వేల్ పట్టణ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ అవసరాలని మాత్రం గజ్వేల్ పట్టణానికి రావడం జరుగుతుంది. దూర ప్రాంతాల నుండి వచ్చిన వారికి దాహార్తిని తీర్చే విధంగా స్థానిక ఇందిరా పార్క్ చౌరస్తా వద్ద గత ఏడు సంవత్సరాలుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, దానిలో భాగంగానే ప్రజలందరికీ బుధవారం నాడు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. మా మిత్రుడు ఏలిశాల కాశీనాథ్ ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి సహకరించారని అతను అమెరికాలో ఉన్నప్పటికీ కూడా ఇక్కడ జరిగే కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని ఈ సందర్భంగా శివకుమార్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమం తోట బిక్షపతి, సిద్ధి బిక్షపతి, ఉప్పల కృష్ణమూర్తి, దుబకుంట రుక్మయ్య, దుబకుంట లచ్చులు, సూపర్ మార్కెట్ లక్ష్మణ్, గౌరిశెట్టి శ్రీనివాస్, గంగా రమేష్, సముద్రాల అమర్నాథ్, మరియాల లింగం. మరియాల శ్రీనివాస్, జగ్గయ్య గారి రాజు, మరుమాముల ఓంకార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.





# 24 గంటల్లో.. హర్మూజ్‌ను దాటిన 20 నౌకలు..!

**టెహ్రాన్, ఏప్రిల్ 15:** హర్మూజ్ జలసంధి సమీపంలో ఇరాన్‌కు నౌకల రాకపోకలను అమెరికా నావికాదళం అడ్డుకుంటోంది. ఈ క్రమంలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. గడిచిన 24 గంటల్లో.. 20కి పైగా నౌకలు హర్మూజ్‌ను దాటి వెళ్లినట్లు తెలుస్తోంది. అమెరికా అధికారులను ఉటంకిస్తూ అక్కడి మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడుతున్నాయి.

పాకిస్థాన్‌లో శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో ఇరాన్ తీరప్రాంతాలను, ఓడరేవులను దిగ్బంధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ నావికాదళాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. అమెరికా సెంట్రల్ కమాండ్ ఈ దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఇది కొనసాగుతుండగానే 20కి పైగా వాణిజ్య నౌకలు హర్మూజ్‌ను దాటి వెళ్లాయనేది ఆ మీడియా కథనాల సారాంశం. అయితే, యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటన ఇందుకు భిన్నంగా ఉంది. ఒక్క నౌక కూడా తమను దాటుకొని వెళ్లలేదని పేర్కొంది. పైగా తమ ఆదేశాలతో హర్మూజ్‌లో ఆరు వాణిజ్య నౌకలు వెనక్కి వెళ్లాయని వెల్లడించింది. ఇరానేతర పోర్టులకు మాత్రమే రవాణాకు అనుమతిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఇక, 'కెప్లర్' నౌకా రవాణా ట్రాకింగ్ డేటా ప్రకారం.. అమెరికా దిగ్బంధం అమల్లోకి వచ్చిన కొన్ని గంటల్లోనే కనీసం రెండు నౌకలు హర్మూజ్‌ను దాటినట్లు పేర్కొంది. ఆ తర్వాత రాత్రి వేళ మరో నౌక కూడా జలసంధిని దాటినట్లు వెల్లడించింది.

# హర్మూజ్ దిగ్బంధనానికి 10వేల మంది సిబ్బంది

## సెంట్రల్ కమాండ్ కమాండర్ అడ్మైరల్ బ్రాడ్ కూపర్



**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** ఇరాన్ ఓడరేవులపై పూర్తి దిగ్బంధనాన్ని విజయవంతంగా అమలుచేసినట్టు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ముఖ్యంగా హర్మూజ్ జలసంధితో సహా కీలక ప్రాంతీయ జలమార్గాలలోనూ అమెరికా దళాలు మోహరించినట్టు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. వివరాల్లోకి వెళ్తే.. హర్మూజ్ జలసంధిపై దిగ్బంధనానికి ఇరాన్ పోర్టుల్లో దాదాపు 10వేల మంది సైనికులు, మెరైనర్లు, వైమానిక దళ సిబ్బందిని మోహరించినట్టు సమాచారం. ''దిగ్బంధనాన్ని ప్రారంభించిన 36 గంటల్లోనే ఇరాన్ నుంచి వెళ్లే వాణిజ్య నౌకలను అమెరికా దళాలు పూర్తిగా నిలిపివేశాయి. సముద్ర మార్గం ద్వారా జరిగే అంతర్జాతీయ వాణిజ్యం పైనే ఇరాన్ ఆర్థికవ్యవస్థ ఎక్కువగా ఆధారపడి ఉంది'' అని యూఎస్ సెంట్రల్ కమాండ్ కమాండర్ అడ్మైరల్ బ్రాడ్ కూపర్ పేర్కొన్నారు. ''యూఎస్ నావికాదళ పర్యవేక్షణలో క్షిపణులు సిద్ధంగా ఉన్నాయి. అవి ఇరాన్ పోర్టుల నుంచి బయటకు వచ్చే, లోపలకు వెళ్లే నౌకలను లక్ష్యంగా చేసుకుంటాయి'' అని అమెరికా సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది. అయితే హర్మూజ్ మొత్తానికి కాకుండా ఇరాన్ పోర్టులను మాత్రమే అమెరికా దిగ్బంధించినట్టు తెలుస్తోంది.

ఇదిలాఉండగా, గల్ఫ్ దేశాల నుంచి బయల్దేరి హర్మూజ్ జలసంధిని దాటేందుకు ప్రయత్నించిన 'రిచ్ స్టార్రీ' అనే నౌక అమెరికా విధించిన దిగ్బంధనం కారణంగా వెనుతిరిగింది. ఈ నౌక 2.50 లక్షల బ్యారెళ్ల చమురును యూఏఈలో నింపుకొని బయల్దేరిందని షిప్పింగ్ డేటా వెల్లడించింది. దిగ్బంధనం మొదటిరోజు ఇరాన్ నుంచి బయల్దేరిన ఎనిమిది నౌకల్లో చైనాకి చెందిన ఒక ట్యాంకర్ కూడా ఉన్నట్టు సమాచారం. అయితే ఒమన్ గల్ఫ్‌లోని ఇరాన్ ఓడరేవు చబహార్ నుంచి బయల్దేరిన రెండు ఆయిల్ ట్యాంకర్లను అమెరికా విధ్వంసక నౌక అడ్డుకుందని యూఎస్ అధికారులు పేర్కొన్నారు.





# 180మంది బాలికలపై లైంగిక వేధింపులు

## నిందితుడి ఇంటిపైకి బుల్డోజర్

**ముంబయి, ఏప్రిల్ 15:** మహారాష్ట్రకు చెందిన తన్వీర్ దాదాపు 180 మంది బాలికలను లైంగికంగా వేధించి.. 350కి పైగా అశ్లీల వీడియోలు చిత్రీకరించిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో అతని ఇంటిపై మహారాష్ట్ర ప్రభుత్వం బుల్డోజర్ ఆపరేషన్ చేపట్టింది. అతడి నివాసానికి సమీపంలోని అక్రమ కట్టడాలను సైతం స్థానిక మున్సిపల్ అధికారులు కూల్చివేశారు.బీజేపీ ఎమ్మెల్యే ప్రవీణ్ పర్యవేక్షణలో ఈ కూల్చివేతలు జరిగినట్లు తెలిపారు. అక్రమ నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ నిందితుడి కుటుంబానికి గతంలోనే నోటీసులు జారీ చేశామని అధికారులు పేర్కొన్నారు. వాటిపై ఎటువంటి స్పందన రాకపోవడంతో కూల్చివేత చేపట్టామన్నారు.

మహారాష్ట్రలోని పరాత్వడ నగరానికి చెందిన మహమ్మద్ అయాజ్ అలియాస్ తన్వీర్ అనే యువకుడు బాలికలను ప్రేమ పేరుతో ట్రాప్ చేసేవాడు. ఆ తర్వాత మాయమాటలు చెప్పి వారిని ముంబయి, పూణేలకు తీసుకెళ్లేవాడు. అక్కడ వారి అశ్లీల వీడియోలు చిత్రీకరించేవాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వీడియోలను ఉపయోగించి బాలికలను బ్లాక్‌మెయిల్ చేయడంతో పాటు.. కొన్నింటిని ఆన్‌లైన్‌లో కూడా షేర్ చేశాడు. ఓ వినతిపత్రం ద్వారా రాజ్యసభ ఎంపీ అనిల్ బోండేకు ఈ విషయం తెలియడంతో నిందితుడి అకృత్యాలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలోనే పోలీసులు అతడిని అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు. సైబర్ సెల్ సాయంతో ఆన్‌లైన్‌లో షేర్ అయిన వీడియోలను తొలగించే చర్యలు చేపట్టారు.

# కేంద్రం తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదు



- రేపు రాష్ట్రవ్యాప్తంగా నల్ల జెండాలతో నిరసనలు
- డీలిమిటేషన్‌పై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 15 : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంలో తమిళనాడు గళాన్ని పట్టించుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దేశాభివృద్ధికి కృషి చేసిన నేరానికి కేంద్రం దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తుందా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పార్టీలు కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. రేపు పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలని చూస్తున్న డీలిమిటేషన్ సవరణ బిల్లుపై దక్షిణ భారత ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని స్టాలిన్ అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు నిరసనగా రేపు రాష్ట్రవ్యాప్తంగా నల్ల జెండాలతో నిరసనలు చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గాల అశాస్త్రీయ పునర్విభజనను తాము వ్యతిరేకిస్తూనే ఉన్నప్పటికీ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తెర పైకి తీసుకురావడం కుట్రపూరిత చర్య అని ఆగ్రహం వ్యక్తంచేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన సవరణ బిల్లు పేరుతో పార్లమెంట్‌లో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు.

# రాఘవ్ చడ్డా సెక్యూరిటీని తొలగించిన పంజాబ్

## రక్షణ కల్పించేందుకు ముందుకు వచ్చిన కేంద్రం



**ఛండీగఢ్, ఏప్రిల్ 15:** రాజ్యసభ ఎంపీ రాఘవ్ చడ్డాకి జెడ్ ప్లస్ సెక్యూరిటీని పంజాబ్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. అయితే కేంద్రం ఆయనకు జెడ్ ప్లస్ కేటగిరీలో భద్రత కల్పించనున్నట్టు సమాచారం. పార్లమెంట్‌లో పంజాబ్‌కు సంబంధించిన కీలక సమస్యలను లేవనెత్తడంలో విఫలమయ్యారని సొంత పార్టీ ఆప్ నుంచే రాఘవ్ చడ్డా విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే కేంద్రం భద్రత కల్పించనున్నట్టు ఇంకా ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా, రాజ్యసభలో ఆప్ ఉపనేత హోదా నుంచి రాఘవ్ చడ్డాను ఆ పార్టీ తొలగించడం మాటల యుద్ధానికి దారితీసిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంటులో గళమెత్తడానికి ఆయన భయపడుతున్నారని పేర్కొంది. చడ్డా స్థానంలో అశోక్ మిత్తల్‌ను రాజ్యసభలో ఆప్ ఉపనేతగా నియమించిన విషయం తెలిసిందే.

# ఆప్ రాజ్యసభ సభ్యుడు అశోక్ మిత్తల్ ఇంటిపై ఈడీ దాడులు



**ఛండీగఢ్, ఏప్రిల్ 15:** ఆప్ రాజ్యసభ సభ్యుడు అశోక్ కుమార్ మిత్తల్ ఇంటిపై ఈడీ దాడులు చేసింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం ఉల్లంఘన ఆరోపణలకు సంబంధించి మిత్తల్ నివాసం సహా ఆయనకు సంబంధించిన పలు వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సోదాలపై వివరణాత్మక ప్రకటనను త్వరలో వెల్లడిస్తామన్నారు. వ్యాపారవేత్త, విద్యావేత్త అయిన అశోక్ కుమార్ మిత్తల్ లవ్లీ గ్రూప్‌నకు అధిపతిగా ఉన్నారు. ఈ గ్రూప్ ఒక యూనివర్సిటీని నడుపుతోంది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంటులో గళమెత్తడానికి తమ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా భయపడుతున్నారనే కారణంతో ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ ఆయనను రాజ్యసభలో తమ పార్టీ ఉపనేత స్థానం నుంచి తొలగించింది. ఆ హోదాలో పంజాబ్ ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించింది. ఈ నియామకం జరిగిన కొద్ది రోజుల్లోనే ఆయన నివాసంలో ఈడీ దాడులు చేపట్టడం గమనార్హం.

### ఆంక్షల సడలింపు పొడిగింపునకు

# అమెరికా 'నో'



## యూఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్


**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన సరఫరాపై ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ చమురుకు సంబంధించి యూఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో టెహ్రాన్ చమురుపై ఉన్న ఆంక్షలను ఇటీవల అమెరికా కాస్త సడలించిన సంగతి తెలిసిందే. తాజాగా వీటిని పొడిగించే ఉద్దేశం తమకు లేదని తేల్చి చెప్పేశారు.

టెహ్రాన్‌పై ఒత్తిడిని తీవ్రతరం చేసేందుకు అనుసరిస్తోన్న వ్యూహాత్మక చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బెసెంట్ పేర్కొన్నారు. ఇరాన్ ఆర్థిక, ఇంధన కార్యకలాపాలను అరికట్టడమే లక్ష్యంగా 'ఎకనామిక్ ఫ్యూరీ'ని ముందుకుతీసుకెళ్తున్నామని తెలిపారు. ఇరాన్ కార్యకలాపాలకు మద్దతిస్తూనే ఉన్న విదేశీ ఆర్థిక సంస్థలపై మరోసారి ఆంక్షలు విధించేందుకు తమ శాఖ సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు కొనుగోళ్లకు తాత్కాలిక అనుమతులు మరికొన్ని రోజుల్లో ముగియనుందన్నారు.

ఈ సడలింపులను పొడిగించేది లేదని తేల్చి చెప్పేశారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన సరఫరాపై ఆందోళనలు వెల్లువెత్తుతుండగా ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేసి, విక్రయించుకోవడానికి యూఎస్ ట్రెజరీ గత నెలలో అనుమతులు జారీ చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇవి ఈనెల 19తో ముగియనుండగా వీటిని పొడిగించేది లేదని తాజాగా స్పష్టం చేసింది.

# నాటో నుంచి అమెరికాకు ఎలాంటి మద్దతు లేదు

## అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** ఇరాన్‌తో యుద్ధానికి, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించే విషయంలో తమకు నాటో కూటమి నుంచి సాయం అందకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ కూటమిపై ఇప్పటికే అనేకసార్లు విరుచుకుపడిన ఆయన తాజాగా మరోసారి దాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. నాటో అమెరికాకు ఎప్పుడూ మద్దతుగా నిలవలేదంటూ ట్రూత్ సోషల్ వేదికగా విమర్శలు చేశారు.

అమెరికాకు అవసరమైనప్పుడు ఎప్పుడూ ఈ కూటమి అండగా లేదని ట్రంప్ ఆరోపించారు. భవిష్యత్తులోనూ దానినుంచి తమకు ఎలాంటి మద్దతు లభించదని మండిపడ్డారు. ఇక, గత కొన్నిరోజులుగా నాటోపై ట్రంప్ విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ఇటీవల కూడా ఈ కూటమిని ఓ కాగితపు పులిగా అభివర్ణించారు. కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు సంచలన ప్రకటన చేశారు. నాటో నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు ట్రంప్ ప్రకటన నేపథ్యంలో యూరప్ ప్లాన్ బీపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఒకవేళ అమెరికా కూటమి నుంచి వైదొలిగితే ప్రస్తుత సైనిక వ్యవస్థలను ఉపయోగించి తనను తాను రక్షించకోగలిగే ఒక ప్రత్యామ్నాయ ప్రణాళికను యూరప్ రూపొందిస్తుందని మీడియాలో కథనాలు వస్తున్నాయి. 'యూరోపియన్ నాటో' పేరుతో ఈ ప్రతిపాదనపై అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు కథనాలు వెల్లడించాయి. కీలక కమాండ్ కంట్రోల్ రోల్స్‌లో ఎక్కువమంది యూరోపియన్లు ఉండేలా చూసుకోవడంతో పాటు అమెరికా సైనిక ఆస్తులను తమ సొంత ఆస్తులకు అనుసంధానించడం వంటివి దీని లక్ష్యం.

### కొనసాగుతోన్న పోప్‌తో జగడం

ఇదిలాఉండగా.. అమెరికాలో జన్మించిన తొలి పోప్ లియో-14, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ల మధ్య జగడం మరింత ముదురుతోంది. పోప్‌ను ఉద్దేశిస్తూ ట్రంప్ మంగళవారం ఓ పోస్టు పెట్టారు. గత రెండు నెలల్లో ఇరాన్ దాదాపు 42వేల మంది అమాయకులైన నిరసనకారులను బలిగొందని ట్రంప్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆ దేశం వద్ద అణ్వాయుధం ఉండటం సరైనది కాదని ఉద్ఘాటించారు. ఈ విషయం పోప్ లియోకు అర్థమయ్యేలా ఎవరైనా చెప్పాలంటూ ఎద్దేవా చేశారు. పశ్చిమాసియా యుద్ధంపై పోప్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ ఘాటుగా స్పందించిన సంగతి తెలిసిందే. దీంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

# ధైర్యముంటే నా కారు రోజూ చెక్ చేయండి

- పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

**కోల్‌కతా, ఏప్రిల్ 15:** అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ పశ్చిమ బెంగాల్లో తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో తాను ప్రయాణిస్తున్న వాహనాన్ని చెక్ చేసేందుకు కేంద్ర బలగాలు యత్నించాయని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఆరోపించారు. కేవలం టీఎంసీ నాయకుల వాహనాలనే తనిఖీ చేయాలంటూ ఆదేశాలు అందాయా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర్ దినాజ్‌పూర్ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న మమత మాట్లాడుతూ ''ఈరోజు ఉదయం కోల్‌కతా ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా కేంద్ర బలగాలు నా కారును చెక్ చేయడానికి ప్రయత్నించాయి.కేవలం టీఎంసీ నాయకుల వాహనాల్లోనే ఈ చెకింగ్‌లు జరుగుతున్నాయి'' అని ఆరోపించారు. మమతాబెనర్జీ మేనల్లుడు, తృణమూల్ నాయకుడు అభిషేక్ బెనర్జీ వాహనాన్ని కూడా తనిఖీ చేసినట్టు సమాచారం. ''కేవలం టీఎంసీ నాయకుల వాహనాలనే లక్ష్యంగా చేసుకొంటున్నారు. ఇది కుట్రపూరిత చర్యే'' అని టీఎంసీ నేత కునాల్ ఘోష్ పేర్కొన్నారు.

# జ్ఞానబోధ చేసే పెద్దాయన ఆయన పిల్లలకు చేయడా?



## ఎన్నికల ప్రధాన కమిషనర్‌పై ఎంపీ మహువా మొయిత్రా విమర్శ


**నోయిడా, ఏప్రిల్ 15:** ఉత్తరప్రదేశ్ గౌతమ్ బుద్ధనగర్‌లోని నొయిడాలో ఓ పరిశ్రమలో కనీస వేతనాలు అమలుచేయాలంటూ కార్మికులు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గౌతమ్ బుద్ధనగర్ డిస్ట్రిక్ మేజిస్ట్రేట్ మేధా రూపమ్ లక్ష్యంగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ''బెంగాల్లో శాంతిభద్రతలపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్ జ్ఞానబోధ చేస్తుంటారు. కానీ పిల్లలకు మాత్రం ఆ అంశంపై కనీస విషయాలు బోధించలేదు పాపం. డిస్ట్రిక్ మేజిస్ట్రేట్‌గా ఉన్న ఆయన కుమార్తెకు న్యాయపరమైన నిరసనలను ఎలా ఎదుర్కోవాలో తెలియదు. సిగ్గుచేటు'' అంటూ మొయిత్రా దుయ్యబట్టారు. ఈ పోస్టుతో మేధా గురించి నెటిజన్లు ఆరా తీస్తున్నారు.

మేధా రూపమ్.. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కుమార్తె. గత ఆగస్టులో గౌతమ్ బుద్ధనగర్‌కు తొలి మహిళా డిస్ట్రిక్ మేజిస్ట్రేట్‌గా నియమితులై చరిత్ర సృష్టించారు. హాపుర్, కాస్‌గంజ్ డీఎంగా, గ్రేటర్ నొయిడా అథారిటీ అడిషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఇటీవల కనీస వేతనాలు అమలుచేయాలంటూ ఓ పరిశ్రమకు చెందిన కార్మికులు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. దాంతో నొయిడాలోని రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దాంతో కార్మికుల సంక్షేమం కోసం మేధా పలు చర్యలను ప్రకటించారు. కార్మికులు సంయమనం పాటించాలని, హింస సమాధానం కాదని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ నిరసనలు తీవ్రరూపం దాల్చకుండా నియంత్రించలేకపోయారనే విమర్శను ఎదుర్కొంటున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) విషయంలో జ్ఞానేశ్ కుమార్, తృణమూల్ కాంగ్రెస్ల మధ్య విభేదాలు నెలకొన్నాయి. తృణమూల్.. (సర్)కు వ్యతిరేకంగా ఢిల్లీలో పోరాటాన్ని చేపట్టింది. అలాగే సీఈసీ ఉద్వాసనకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.

# ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి

## మఠంలో ఏర్పాటు చేసిన సభలో హామీ తీసుకున్న ప్రధాని నరేంద్ర మోడీ



**బెంగళూరు, ఏప్రిల్ 15:** ప్రధాని నరేంద్ర మోడీ కర్ణాటకలోని ఆదిచుంచనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో నరేంద్ర మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి ప్రధాని హామీ తీసుకున్నారు. ''మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కోసం మీరంతా నాకు వాటిపై ప్రమాణం చేయండి. ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతో పాటు దేశ అభివృద్ధీ వేగంగా జరుగుతుంది'' అని ప్రధాని నరేంద్ర మోడీ వెల్లడించారు. హామీలు ఏంటంటే..నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడదాం. పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం..అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం...'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం...జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం...రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం.

ఆహారంలో చిరుధాన్యాలను భాగం చేసుకుందాం...నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం. ఫిట్‌గా, బరువుని అదుపులో చేస్తామని మాట ఇవ్వండని భారత ప్రధాని నరేంద్ర మోడీ కోరారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోడీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని గుర్తుచేశారు.






# సాకులు చెప్పం..

## నాతో సహా మెరుగుపడాల్సిందే: రుతురాజ్



ఐపీఎల్ 2026 సీజన్ లో చెన్నై సూపర్ కింగ్స్ విజయాలబాట పట్టింది. ఆరంభంలో కాస్త ఇబ్బందిపడిన ఆ జట్టు.. వరుసగా రెండు మ్యాచుల్లోనూ గెలిచింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో మెరుగైన సీఎస్కేకు ఫీల్డింగ్ వైఫల్యం ఇప్పుడు కొత్త సమస్యగా మారింది. కోల్ కతా నైట్ రైడర్స్ మ్యాచ్ లో సులువైన క్యాచులను కూడా ఆ జట్టు ఫీల్డర్లు జారవిడిచారు. అందులో కెప్టెన్ రుతురాజ్, సర్ఫరాజ్ ఖాన్ అయితే మరీనూ. చేతిలో పడినవాటినీ వదిలేయడం అభిమానులను బాధించింది. చివరికి సీఎస్కే విజయం సాధించింది కాబట్టి విమర్శలు ఎదురవలేదు. అయితే, తమ ఫీల్డింగ్ కు సంబంధించి తాము ఎలాంటి సాకులు చెప్పబోమని.. ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని కెప్టెన్ రుతురాజ్ స్పష్టంచేశాడు.

''చెన్నై పిచ్ పై మంచి స్కోరునే డిఫెండ్ చేసి విజయం సాధించడం ఆనందంగా ఉంది. పిచ్ లో నాటకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. కొన్నిసార్లు టర్నింగ్ వచ్చింది. మరికొన్నిసార్లు సహకారం లభించలేదు. ఈ పిచ్ పై తొలుత కనీసం 220 పరుగులు చేస్తేనే విజయావకాశాలు ఉంటాయని భావించాం. కానీ, మ్యాచ్ జరిగేకొద్దీ 190 రన్స్ కూడా కాపాడుకోవచ్చని అర్థమైంది. బౌలింగ్ వేసేటప్పుడు పవర్ ప్లేలో కీలక వికెట్లు తీయడం మాకు కలిసొచ్చింది. జట్టులోని ప్రతి బౌలర్కూ తమ పాత్ర ఏంటో తెలుసు. పరిస్థితులను త్వరగా అలవర్చుకొని జట్టు అవసరాలకు తగ్గట్టు స్పందించారు'' అని రుతురాజ్ కొనియాడాడు.

**అలా చేయబోం..**

''ఈ మ్యాచ్ లో కొన్ని క్యాచులు అందుకోలేకపోయాం. డ్యూ ప్రభావం బాగుంది. మరోవైపు చేతులకూ ఎక్కువగా చెమట పట్టింది. దీంతో క్యాచులను అందుకోవడం కాస్త కష్టమైంది. అయితే, దీనిని మేం సాకుగా చెప్పడం లేదు. ప్రతి క్యాచ్ ను అందుకోవాల్సిందే. ఈ విషయంలో ఇంకా మెరుగుకావాల్సిందే. బౌలర్లు చాలా కష్టపడి వేసినప్పుడు క్యాచ్ లను వదిలేయకూడదు. నేను కూడా సులువైన దానిని డ్రాప్ చేశాను. కొన్నింటిని వదిలేసినా విజయంపై పెద్దగా ప్రభావం చూపించలేదు. ఇక నా ఫామ్ పైనా ఆందోళన లేదు. ఫిట్ నెస్ పరంగా, మానసికంగానూ చాలా బాగున్నా. ఒకే ఒక్క పెద్ద ఇన్నింగ్స్ వస్తే అన్నీ కుదురుకుంటాయి. మిగతా సహచరులు నన్ను కవర్ చేస్తూ జట్టును నడిపిస్తున్నారు. తప్పకుండా మున్ముందూ మంచి ఇన్నింగ్స్ వస్తుందని భావిస్తున్నా'' అని రుతురాజ్ వెల్లడించాడు.

## టైటిల్ కు చేరువలో వైశాలి



క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో అద్భుత ప్రదర్శన చేస్తున్న వైశాలి టైటిల్ కు చేరువైంది. అగ్రస్థానంలో ఉన్న ఆమె ఆఖరి రౌండ్లో నెగ్గితే.. ప్రపంచ ఛాంపియన్ షిప్ కోసం పోటీపడే అవకాశం లభిస్తుంది. కాకపోతే 7.5 పాయింట్లతో ఆమెతో సమానంగా ఉన్న బిబిసారా (కజకిస్థాన్) ఓడిపోవాలి లేదా డ్రా చేసుకోవాలి. వైశాలి అవకాశాలు భారత స్టార్, ప్రపంచ కప్ విజేత దివ్య దేశ్ ముఖ్ పై ఆధారపడివున్నాయి. ఎందుకంటే ఆఖరి గేమ్ లో బిబిసారాను ఢీకొనేది దివ్యనే. వైశాలి తన ఆఖరి గేమ్ లో కేథరినాతో ఆడనుంది. పదమూడో రౌండ్లో టాన్ జోంగ్యి (చైనా)తో గేమ్ ను వైశాలి డ్రా చేసుకుంది. అనా ముజ్ చుక్ (ఉక్రెయిన్)పై బిబిసారా విజయం సాధించింది. దివ్య దేశ్ ముఖ్ (5).. కేథరినా (రష్యా) చేతిలో ఓడిపోయి, అట్టడుగున ఉంది. ఓపెన్ విభాగంలో కరువానా (అమెరికా)తో గేమ్ లో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకున్నాడు. ప్రజ్ఞా (5.5 పాయింట్లు) వీ యి (చైనా)తో ఉమ్మడిగా అయిదో స్థానంలో ఉన్నాడు. ఇప్పటికే టైటిల్ ఖాయం చేసుకున్న జవోకిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్).. 13వ రౌండ్లో అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో గేమ్ ను డ్రా చేసుకున్నాడు. రెండో స్థానంలో ఉన్న అనీష్ (7.5) కంటే సిందరోవ్ (9.5) రెండు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నాడు. ఈ ఏడాది ఆఖర్లో ప్రపంచ ఛాంపియన్ షిప్ కోసం అతడు భారత ఆటగాడు దొమ్మరాజు గుకేశ్ ను ఢీకొననున్నాడు.


## రోహిత్ శర్మ గాయంపై తాజా అప్ డేట్..!



ముంబయి ఇండియన్స్ అభిమానులకు గుడ్ న్యూస్. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో భారీ లక్ష్య ఛేదన చేస్తుండగా ముంబయి ఓపెనర్ రోహిత్ శర్మ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్ గా వెనుదిరిగాడు. దీంతో 241 పరుగుల ఛేదనలో ముంబయి 222 పరుగులకే పరిమితమైంది. అప్పటికి రోహిత్ 13 బంతుల్లో 19 పరుగులు చేశాడు. ఈ క్రమంలో రోహిత్ గాయంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. అయితే, అతడికి సంబంధించి మెడికల్ రిపోర్ట్ వచ్చేసింది. కండరాలు పట్టేయడంతో మైదానం వీడిన అతడు.. స్కానింగ్ తీయించుకున్న సంగతి తెలిసిందే. ఆ రిపోర్ట్ ప్రకారం ఎలాంటి చీలిక లేదని తేలింది. దీంతో ముంబయి ఇండియన్స్ ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు. అయితే, పంజాబ్ తో గురువారం మ్యాచ్ లో ఆడతాడో? లేదో అనేది ఇంకా అనిశ్చితిగానే ఉంది. గాయం మరీ పెద్దది కాకపోవడంతో తొలుత అనుకున్నట్లు మరిన్ని మ్యాచులకు మాత్రం దూరమయ్యే అవకాశం లేదు. ఇవాళ సాయంత్రానికి ఫిట్ నెస్ పై స్పష్టత రానుంది. ''కండరాలు పట్టేయడంతో రోహిత్ మైదానం వీడాడు. అయితే, స్కానింగ్ లో ఎలాంటి గాయం కనిపించలేదు. దీంతో మరిన్ని మ్యాచులకు దూరం అవుతాడనే ఊహాగానాలకు తెరపడినట్లే. అయితే, గురువారం పంజాబ్ తో రోహిత్ ను బరిలోకి దింపుతారా? లేదా? అనేది మేనేజ్ మెంట్ చేతుల్లోనే ఉంది. ఓపెనర్ గా మంచి ఫామ్ లో ఉన్న రోహిత్ సేవలు జట్టుకు అవసరమే. కనీసం అతడిని ఇంపాక్ట్ ప్లేయర్ గానైనా బరిలోకి దింపే అవకాశం లేకపోలేదు'' అని ఐపీఎల్ వర్గాలు పేర్కొన్నాయి. ఐపీఎల్లో ఒక ఫ్రాంచైజీ తరఫున 6వేల పరుగులు చేసిన బ్యాటర్ గా రోహిత్ నిలిచాడు.



## రామ్ చరణ్ 'పెద్ది'.. మరోసారి వాయిదా



రామ్చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న 'పెద్ది' మరోసారి వాయిదా పడింది. సోషల్ మీడియా వేదికగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఏప్రిల్ 30న రిలీజ్ కావాల్సిన ఈ చిత్రాన్ని జూన్ కు పోస్ట్ పోన్ చేసింది. కొత్త విడుదల తేదీని అతి త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది. ''పెద్ది' సాంగ్స్, గ్లింప్స్ పై మీ ఆదరణకు ధన్యవాదాలు. టాకీ పార్ట్ షూటింగ్ పూర్తయింది. ఒక్క పాట షూటింగ్ మిగిలి ఉంది. అవుట్ పుట్ తో సంతోషంగా ఉన్నాం. ఇంత గొప్ప కంటెంట్ మా చేతిలో ఉంది కాబట్టి.. దానిని మరింత బాగా ప్రెజెంట్ చేయాలనుకుంటున్నాం. అందుకే పోస్ట్ ప్రొడక్షన్స్ వర్క్ కు సంబంధించి సాంకేతిక నిపుణులకు మరికొంత సమయం ఇవ్వడం ముఖ్యం అనుకున్నాం. మీకు బెస్ట్ థియేట్రికల్ అనుభూతి ఇవ్వడం మా బాధ్యత. దీనిని దృష్టిలో పెట్టుకుని వాయిదా వేశాం'' అని 'పెద్ది' టీమ్ వివరించింది. మార్చిలోనే రావాల్సిన ఈ మూవీ ఇంతకుముందు ఈనెల 30కు వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇది. జాన్వీ కపూర్ హీరోయిన్ కాగా.. కన్నడ నటుడు శివరాజ్ కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ, జగపతి బాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## ఘనంగా అనన్య నాగళ్ల లీసా ఫస్ట్ లుక్ విడుదల



అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం లీసా. జవహర్ లాల్ రాజు దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ లాంఛ్ ఈవెంట్ ఆదివారం హైదరాబాద్లో ఘనంగా జరిగింది. ఈ చిత్రాన్ని ప్రవాస భారతీయులు వెంకట్ దుగ్గిరెడ్డి, రామకృష్ణ ఐలా నిర్మిస్తుండగా.. సతీష్ రెడ్డి మాసం స్క్రీన్ప్లే, సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

ఈ సందర్భంగా హీరోయిన్ అనన్య నాగళ్ల మాట్లాడుతూ.. లీసా తన కెరీర్లో గుర్తుండిపోయే సినిమా అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ చేయని ఓ భిన్నమైన పాత్రలో నటిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 7 నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు దర్శకుడు కష్టపడి పనిచేశారని, సతీష్ రెడ్డి అద్భుతమైన విజువల్స్ ఇచ్చారని ప్రశంసించారు. ఈ సినిమా హిట్టైతే నిర్మాతలకు మరో సినిమా ఉచితంగా చేసిపెడతానని ఆమె ప్రకటించడం విశేషం.

దర్శకుడు జవహర్ లాల్ రాజు మాట్లాడుతూ.. డిఫరెంట్ స్క్రీన్ప్లే, మేకింగ్తో రాబోతున్న ఈ సినిమా ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుందన్నారు. అనన్య నటన అందరినీ కట్టిపడేస్తుందని చెప్పారు. ఈ మూవీలో ప్రతి పది నిమిషాలకు ఒక ట్విస్ట్ ఉంటుందని, బడ్జెట్ పరిమితుల్లో వేగంగా షూటింగ్ పూర్తిచేయడానికి అనన్య సహకారం ఎంతో ఉందని డీవోపీ సతీష్ రెడ్డి తెలిపారు.

నిర్మాతలు వెంకట్, రామకృష్ణ మాట్లాడుతూ.. కేవలం విదేశాల నుంచి వచ్చి సినిమా తీసి వెళ్లిపోవాలని కాకుండా, ఓ బలమైన కథతో ఈ ప్రాజెక్ట్ చేస్తున్నామన్నారు. అనన్య డెడికేషన్ను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ.ఎం.రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్ తుమ్మల మధు, నటులు యాదమ్మ రాజు, జెమినీ సురేష్, జాను వర్మ, కిషోర్ దాస్ తదితరులు పాల్గొని చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.







Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.